శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!

జన్మదిన సంచిక




# గురుకృప

ఆద్యంతరహిత అనుగ్రహ ప్రవాహం

## బాబానే సర్వస్వం

భక్తుడు : గురువుగారూ! ఋణానుబంధం అంటే ఏంటి? కొంతమందికి ఎన్ని గొప్ప అనుభవాలు వచ్చినా, వాళ్ళు అది లక్ అంటారు. బాబా గ్రేస్ అంత బాగా కనబడుతున్నా కూడా లక్ అంటారు. కో-ఇన్సిడెన్స్ అంటారు ఎందుకని?

గురువుగారు : అండర్ స్టాండింగ్ లేకపోవడం వల్లనో, ఏదైనా అడిగేటపుడు వాళ్ళు ఒక్కరినే అడగరు కనుక. అనుభవం వచ్చిన తర్వాత కూడా ఎవరు ఇచ్చారో తెలియదు. అదీ వచ్చిన ప్రాబ్లెమ్, ఎప్పుడైనా హెల్త్ బాగా లేకపోతే శనిసింగనాపూర్ పోతారు. నవగ్రహశాంతి చేయిస్తారు. నాగ ప్రతిష్ఠ చేయిస్తారు. జ్యోతిష్యశాంతి చేయిస్తారు. వాస్తు సరిచేసుకుంటారు. సాయిబాబాను కొలుస్తారు. అయ్యప్పస్వామి దగ్గరకు పోతారు. వేంకటేశ్వరస్వామి దగ్గరకు పోతారు. బాగయింది. ఎవరు బాగు చేసినట్టు? కాబట్టి పోయేకొద్దీ పోయేకొద్దీ ఎవరో ఒక్కరే బాగుచేసి ఉంటారు అని వాళ్ళ మనసుకే తెలుస్తుంది. ఇన్ని చోట్లకు పోతున్నాము. కానీ ఒక దగ్గరకు పోయేటప్పటికి పని అవుతుంది. ఓహో! శిరిడీకి పోతే మాకు బాగైంది అనుకుంటారు. రెండోసారి ఇంకొంచెం ఎక్కువ శిరిడీ మీద దృష్టి పెడతారు. మిగతావి కొంచెం తగ్గిస్తారు. ఆ తర్వాత నెమ్మదిగా శిరిడీ ఒక్కటే అని నమ్ముతారు. పని అవుతుంది. ఓహో! మొదటినుండి కాపాడుతుండేది బాబా అని తర్వాత అర్థం చేసుకుంటారు. అప్పుడు మిగతా వాటన్నింటినీ వదులుకుంటారు. లేకపోతే ఎవరు ఏది చెబితే అది చేసుకుంటారు.




మొదట మనకు కన్విక్షన్ లేక చేస్తాము. రెండవసారి మనకు కన్విక్షన్ లేదు అని చెప్పుకోవడానికి సిగ్గుపడి, ఆ పెద్దవాళ్ళు చెప్పారు, నా భార్య చెప్పింది, వాళ్ళ చాదస్తం, చేస్తే ఏం పోయింది. వాళ్ళను ఎందుకు హర్ట్ చేయాలి? వాళ్ళను ఒక్కసారి కూడా బాబా దగ్గరకు తీసుకొచ్చే దమ్ము మనకు లేదు. కానీ మనం మాత్రం వాళ్ళు చెప్పినట్టు వింటూ ఉండాలి. వాళ్ళను హర్ట్ చేయడం ఎందుకు అని వాళ్ళు అనుకోవడం లేదే! కాబట్టి నిజంగా చెప్పాలంటే హర్ట్ చేయడం కాదు, ఏం కాదు. మనకే లోపల అదంత స్ట్రాంగా లేదు. కాబట్టి అది చేయాలి, ఇది చేయాలి అని వాళ్ళు అంటే. ఏముంది? చేస్తే పోతుందిగా, ఏదో వాళ్ళ చాదస్తం, ఏదోనండీ నా భార్య వ్రతం చెయ్యమంది. చేస్తే ఏమైపోయిందట ఇప్పుడు? అయినా ఆ

సంపుటి : 26
సంచిక : 1



జన్మదిన సంచిక
1 జనవరి 2023

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

పథగామి - గురుకృప 4
సద్గురుకృపకు ప్రతీక ఈ గురుకృప పత్రిక 9
\- సాయినాథుని నారాయణరావు
మనలోని బలహీనతలను పోగొట్టుకోవడం ఎలా? 12
\- గురుదేవుల అనుగ్రహభాషణం నుండి...



17 గురుకృప రజతోత్సవం
\- గురుకృప
19 కులాల కుళ్ళు - మతాల మళ్ళు - శ్రీబాబూజీ
21 ఆనందపూర్ణుని పుష్కర ఆరాధన
\- భీమ్, చెన్నై
26 గురుకృపాలహరి
\- గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

## భగవంతుడు మన నుండి కోరేది కాలము మరియు మన మనస్సు మాత్రమే

కానీ మనం కాలం, మనస్సు తప్ప మిగతా ఏవోవో సాధనలంటూ చేసేస్తూ ఉంటాము. ఎన్నో జన్మల నుండి తగుల్కొని వస్తున్న వాసనల ప్రభావంతో మనసును భగవంతునికి అర్పించడం కష్టతరమవుతుంది. కానీ కాలం వెచ్చించేందుకు ఏ ఆటంకమూ లేదు. ఆటంకాలన్నీ మనం కల్పించుకునేవే. బలవంతంగానైనా కూర్చోబెట్టాలి శరీరాన్ని ప్రతిరోజూ. నిర్ణీతకాలంలో సాధ్యమైనంతసేపూ మన కాలాన్ని దైవానికి సమర్పిస్తూ, సాధ్యమైనంతగా మనసును దైవచింతనతో నింపుకునే తీవ్రమైన, హృదయపూర్వకమైన ప్రయత్నం చేస్తూంటే దైవకృప గుర్వానుగ్రహం ద్వారా మనలను (ఆ)వరిస్తుంది. ప్రతిరోజూ నిర్ణీతకాలంలో పారాయణ, ప్రదక్షిణ, నామజపం, ధ్యానం, పూజ వంటి ఉపకరణాల ద్వారా మనసు ఆ కొంతసేపైనా భగవంతుడు లేదా గురువుపై నిమగ్నమై ఉంటుంది.

ఆ నిర్ణీతకాలంలో పూర్తిగా నిమగ్నమైన మనస్సు, ఆ సమయం తర్వాత కూడా అదే తమకంతో కొంతసేపైనా ఉంటుంది. అలా ఉండటం వల్ల మనసులోకి అసూయ, ఈర్ష్య, కామం, క్రోధం, లోభం వంటి దుర్గుణాలు చేరేందుకు సాహసించలేవు.అయితే భగవత్ చింతన కోసం కూర్చున్న కొద్ది సమయం కూడా ఆయనకు అర్పించకుండా అనవసరమైన విషయాలను చింతన చేస్తుంటే మనం చేస్తున్నదంతా బూడిదలో పోసిన పన్నీరు చందమే అవుతుంది.

శ్రీవెంకయ్యస్వామివారి దగ్గర సేవ చేస్తున్న సేవకుడు ఒకసారి బయటి జనాలతో పిచ్చాపాటి కబుర్లు, రాజకీయాలు మాట్లాడి నింపాదిగా శ్రీస్వామివారికి సేవ చేసేందుకు వచ్చాడు. కానీ శ్రీస్వామివారు ఆ సేవకుని సేవను తిరస్కరించారు. నలుగురు మాట్లాడుకునేటపుడు అక్కడ చేరి, మనం కూడా కాలక్షేప కబుర్లు ఎన్ని చెప్పలేదు? మరి అలా ప్రతిరోజూ గడుపుతున్న మన పూజలను, సేవలను భగవంతుడు స్వీకరిస్తారా? స్వీకరించడం లేదు. ఆ వైపుగా ఎప్పుడైనా ఆలోచించామా? ఆలోచన వచ్చిందా? బాబా లీలలు చదివాక! (రాధాకృష్ణమాయి స్నేహితురాలి వృత్తాంతం, వాడాలో జరిగిన వాదనలో పాల్గొన్న దీక్షిత్ వృత్తాంతం). నేను పదార్థాలను స్వీకరించను. ఆ పదార్థం వెనుక ఉన్న ప్రేమను స్వీకరిస్తాను అంటారు శ్రీబాబూజీ. ఈ సాలోచనలో మనం ఎక్కడున్నామో, ఎంత దూరంలో ఉన్నామో, ఎంత ఆయనవారమో మనకు అవగతమవుతుంది. తమ లీలల ద్వారా, తమ అలతి అలతి పదాలతో మనం ఎలా ఉన్నామో, ఆయనకు తగ్గవాడిగా ఉండాలంటే ఎలా ఉండాలో చెబుతున్నారు.



అంటే ఇక్కడ మనం కాలాన్ని భగవంతునికి అర్పించడం లేదు. మరి పొద్దస్తమానం లౌకికపరమైన చింతనలతో గడిపేవారి పరిస్థితి ఏమిటి? డబ్బు గురించి, వ్యాపారాల గురించి, మనుషుల గురించి, రాజకీయాల గురించి మాట్లాడుకోవడమే గాక, ఆయా సంఘటనలను వ్యక్తులను పాజిటివ్‌గాగాని, నెగిటివ్‌గాగాని (అంటే రాగంగా లేదా ద్వేషంగా) మనసులో అభిప్రాయాలుగా ముద్ర వేసుకుంటుంటాము. అప్పుడు ఇంకా ఇంకా ఆ రొచ్చును మీదేసుకుంటూ అదే ఆనందమన్నట్లు (పందికి బురద ఆనందకారకమైనట్లు, అశుద్ధాన్ని తింటున్న పందిని చూపిన వృత్తాంతం) మునకలేస్తుంటాము. ఇలాంటి పరిస్థితుల వల్ల ఇంకా ఇంకా భగవంతునికి దూరమయ్యే దుస్థితి దాపురిస్తుంది. మన యొక్క ఆధ్యాత్మిక ఉన్నతి గురించి మన అడుగులు సాగాలన్నదే సద్గురు బోధలోని అంతరార్థం. కానీ ఇందుకు విరుద్ధంగా రాగద్వేషాదుల ఉచ్చును మెడకు తగిలించుకుంటున్నాము.

**మనకు శరీరాన్ని ఇచ్చి, ఊపిరినిచ్చి, అన్న పానీయాలు వేళకు అందించి భగవద్భక్తితో తానుగా మారమని భగవంతుడు మహాత్ముల రూపంలో బోధ చేస్తుంటే, ఆ బోధను పెడచెవిన పెడుతున్నాము.** అందువల్లనే ఉబుసుపోని కబుర్లతో, బుర్ర వేడెక్కించే అనవసరపు ప్రసంగాలతో, చర్చలతో రోజులోని 24 గంటలను వృథా చేస్తున్నాము. (అవి మనకుగాని, వినే వాడికిగాని, లేదా మూడో వ్యక్తికి గాని ఉపయోగపడాలి అంటారు శ్రీబాబూజీ. కానివన్నీ ఉబుసుపోని కబుర్లతో కాలక్షేపం అవుతుంది.) ఇప్పుడంటే మానవజన్మ వచ్చింది. పై చెప్పిన పనుల వల్ల మళ్ళీ జన్మ మనిషిగా వస్తుందో రాదో? ఎవరికి తెలుసు? ఒకవేళ వచ్చినా భగవంతుడి చింతన చేయగలిగి, ఉన్నతంగా బ్రతకగలిగే జన్మ అవుతుందో, కాదో? ఎవరికి తెలుసు. అందుకే వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలి. లేదంటే సాయి అడిగినట్లు, **"ఎందుకు ఈ జీవితంలోకి వచ్చింది? పిడకలు ఏరుకోవడానికా?"** అన్నట్లు అవుతుంది. మన శ్రద్ధ–చుట్టూ జరుగుతుండే విషయాలు, వస్తువులపై కాకుండా, భగవంతునిపై పెడితే యథాలాపంగానే మన యొక్క జాగృతి జరుగుతుంది.

"నేను భగవంతునికి దగ్గరయ్యానా? లేదా? ఈ రోజు భగవంతునికి ప్రీతి నొనర్చే పని ఏదైనా చేసానా? లేదా?" అని ఎవరికి వారం విశ్లేషించుకుని ప్రతి క్షణమూ భగవన్మయం చేసుకునేందుకు మనసుని, హృదయాన్ని మలచుకోవాలి. చేస్తున్న ప్రతి పనిని భగవంతుని కార్యంగా తలస్తూ చేస్తుండాలి. చూస్తున్న ప్రతి వ్యక్తి, ప్రతిజీవి కూడా భగవత్ చైతన్యం ఆధారంగా ప్రవర్తిస్తున్నాయని గుర్తెరిగి, సాక్షాత్తూ దైవంతోనే ప్రవర్తిస్తున్నట్లు ఎదుటివారితో (ఇతర జీవులతో కూడా) ప్రవర్తించగలగాలి. **(అంతటా,**



**అన్నిటా ఉన్న నన్ను గుర్తించి అనుగుణంగా వర్తించే వారు నాకు ప్రీతిపాత్రులు అంటారు శ్రీసాయి).** అట్లే, పలికే ప్రతీ పలుకు భగవంతునికి చేయు నీరాజనంగా తలచి పలకాలి.

జరుగుతున్న ప్రతిదీ భగవత్ నిర్ణయం మేరకే జరుగుతున్నదని తలుస్తూ జీవనం సాగించాలి. ఇలా చేస్తుంటే భగవంతుని కోసం ఏ పది నిమిషాలో, గంటో, ఏ కొద్దిసేపో కేటాయించినట్లుగాక రోజు మొత్తాన్ని కేటాయించినట్లు అవుతుంది. ఇదే సాధనలో జీవితం భాగం కావడం అంటే. "మనం చేసుకున్నదే గదా మనకు వచ్చేది" అని హెచ్చరిస్తున్నారు మహాత్ములు.

**దివ్యత్వాన్ని త్యజించిన త్యాగి :** ఒకసారి ఒక రాజు వనవిహారం చేస్తుండగా ఒకచోట ఒక యతీశ్వరుడు కనిపించాడు. ఆయనను చూడగానే రాజు తన పరివారాన్ని నిలిపివేసి, గుర్రం దిగి ఆ మహాత్ముని వద్దకు చేరి సాష్టాంగ ప్రణామం చేసుకున్నాడు. అప్పుడు ఆ మహాత్ముడు "ఎందుకు నీవు నమస్కరిస్తున్నావు?" అని ప్రశ్నించాడు. "మహాత్మా! మీరు సన్యాసి, మహాత్ములు. మీరు ఇదివరలో రాజ్యపరిపాలన చేసినవారు. దాన్ని త్యజించి మీరు ఈ సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు. మీరు మహాత్యాగులు అందుచేత మిమ్ములను దైవస్వరూపులుగా ఎంచి మీకు నమస్కరిస్తున్నాను" అన్నాడు రాజు. అప్పుడా మహాత్ముడు "అదే కారణమైతే ముందుగా నేనే నీకు నమస్కరించాలి. నీ పాదాలకు అభిషేకం చేయాలి. ఈ ప్రపంచంలో ఉన్న సన్యాసులందరి త్యాగాన్ని కలిపినా నీ త్యాగానికి సరిపోదు" అని పలికారు. అదెట్లా స్వామీ అని రాజు ఆశ్చర్యం వ్యక్తం చేసాడు. ఆ మహాత్ముడు ఇలా చెప్పసాగాడు. "ఒక వ్యక్తికి దివ్య భవనము ఉన్నది. అతడు అందులో నుండి వెలువడే చెత్తాచెదారాన్ని, ఇతర మలిన పదార్థాలను అన్నింటినీ బయట పారవేస్తాడు. అంటే వాటిని త్యాగం చేసాడు. కానీ, ఆ దివ్య భవనాన్ని మాత్రం త్యజించడు. దాన్ని తనదిగా ఉంచుకుంటాడు. అట్టివాడు త్యాగి అవుతాడా?" అనగానే "ముమ్మాటికి త్యాగి కానేరడు" అంటాడు రాజు. "మరియొకడు మాలిన్యమంతా తానే ఉంచుకొని, తన దివ్యమందిరాన్ని త్యాగం చేస్తాడు. మరి అతడు ఎటువంటివాడు?" ప్రశ్నించాడు మహాత్ముడు. "దివ్య మందిరాన్ని త్యాగం చేసినవాడే అసలైన త్యాగి అవుతాడు" బదులిచ్చాడు రాజు. "అందుకనే మహారాజా! నీవే నిజమైన త్యాగివి. నీవు నీ నిజాత్మను, పరమాత్మను, నీ ఆనందధామమును, నీ దివ్య భవనమును త్యాగం చేసావు. ఆ భవన మాలిన్యాన్ని మాత్రమే నీవు ఉంచుకున్నావు. **నేను దేన్నీ త్యాగం చేయలేదు. నేను త్యాగం చేయడానికి రెండవ వస్తువే లేదు. (అంత దగ్గరయ్యాడు. ఎంత దగ్గర అంటే నేను లేకుండా బాబానే ఉండటం).** నేను సమస్త విశ్వరూపుడైన పరమాత్మను. నాకు మినహా ఏదీ లేదు". అని ఆ మహాత్ముడు పలుకుతాడు. రాజుకు తన పరిస్థితి అర్థమై, అక్కడి నుండి మౌనంగా నిష్క్రమించాడు.



మనం కూడా ఇక్కడి రాజు వంటి వారమే! భగవంతుడిని వదిలేసి, ఆయనను మరిపించే, ఆయనను దూరం చేసే జీవ, వస్తుజాలాన్ని అంటిపెట్టుకొని, అదే ఆనందమనుకొని బ్రతుకులు ముగించుకుంటున్నాము. శాశ్వతంగా బ్రతకడం మానేసి, పదే పదే చస్తూ పుడుతూ ఉన్నాము. ప్రతి జన్మలోనూ కష్టాలను వదలడం లేదు. సంతోషాలు మన చుట్టూ ఉన్న జీవ వస్తుజాలం వల్ల పొందుతున్నామని భ్రమపడి భ్రమ్మగిపోతున్నాము.

ఆ మహాత్ముడి వ్యంగ్య బాణాలు ఆ రాజుకే కాదు, గుర్తిస్తే మనకు కూడా తగులుతున్నాయి కదూ! అందుకే మనం మనలోని చెత్తాచెదారాన్ని, మాలిన్య గుణాలను వదిలేసి, మనమున్న దివ్యధామాన్ని, అంటే మన నిజస్థితిని మనం విడనాడకుండా గట్టిగా నిలబడి ఉందాం. నీవు నా సంబంధీకుడివి అని బాబానే చెప్పారు. "నిన్ను నాకు అల్లా అప్పచెప్పారు" అంటూ మనమెవరిమో, మన నిజస్థితి ఏమిటో బాబా చెబుతున్నారు. బాబా–ఉపాసని గురించి, వీడి హృదయం బంగారపు పోత అన్నారు. వాడికి నాదంతా ధారపోసాను అని. మరి మనం అలా ఉండకుంటే, ఎట్లా ఆయన వారిమవుతాం? బాబా పైన మనకి కేవలం భక్తి ఉంటే సరిపోదు, ఆయనపైన భక్తితోపాటు, ఆయన స్వభావం పైన, ఆయన ప్రవృత్తిపైన, ఆయన అమలుపరిచే సూత్రాలపైనా, ఆయన లక్షణాలపైనా, ఆయన ఆదర్శాలపైనా కూడా భక్తి ఉండాలి. ఈ సృష్టిని నడిపించడానికి ఆయన అనుసరించే సూత్రాలని పాటిస్తే, అదే దైవాన్ని ప్రేమించినట్లు. కమీషనర్‌గారో, ప్రిన్సిపాల్‌గారో ఉన్నారనుకోండి. కేవలం ఆ కమీషనర్‌గారిపైన, ప్రిన్సిపాల్‌గారిపైన భక్తున్నంత మాత్రాన ప్రమోషన్ రాదు. ఇంక్రిమెంట్ రాదు. రివార్డులు, అవార్డులు రావు. ఆయనపైన ఎంత భక్తి ఉన్నా ప్రిన్సిపాల్‌గారు రూపొందించిన సూత్రాలుంటాయి కదా. వాటిపైన భక్తి కలగాలి. భక్తి కలగడమంటే ఆ సూత్రాల్ని తెలుసుకొని, ఆచరించడం. కేవలం సూత్రాలు తెలుసుకొనేంత ప్రేమ సరిపోదు. ఆచరించేంత ప్రేమ ఉన్నప్పుడు మాత్రమే ఆ సూత్రాలు ఆచరిస్తూ పోతాం. అది భక్తి, క్లాసుకి క్రమం తప్పకుండా వస్తాను. పాఠాలు బాగా చెప్తాను. పరీక్షలు బాగా నిర్వహిస్తాను. పేపర్లు దిద్దుతాను. ఈ పనులన్నీ చేసాననుకోండి. నాకు వద్దన్నా అవార్డు రాదా? ప్రమోషన్ రాదా? ఇంక్రిమెంట్ రాదా? రివార్డు రాదా? అలా కాకుండా ప్రిన్సిపాలుగారిమీదా, కమీషనర్‌గారిమీదా నేను బాగా భక్తి పెట్టుకుంటాను. ఆ సూత్రాలు మాత్రం అనుసరించను. అంటే, ప్రమోషన్ వస్తుందా? స్కూల్ పిల్లాడు ఉన్నాడు, టీచర్ అంటే చాలా ప్రేమ. కాని క్లాసుకి సరిగా రాడు. టీచర్ చెప్పినవి వినడు. తెలుసుకోడు, చదవడు, చేయడు. ఇప్పుడు వాడు ఉత్తీర్ణత చెందుతాడా? జీవితంలో ఉన్నతి పొందాలన్నా, ఎదగాలన్నా గురువుపట్ల, గురువు చెప్పిన, చూపిన వాటిపట్ల కూడా ప్రేమ ఉండాలి.



ఎంత ప్రేమ అంటే విన్నాం-అలా ఉందాం, చెప్పారు - అలా చేద్దాం అన్నంత. దీనినే శ్రవణభక్తి, ఆచరణభక్తి అంటారు. ఆచరణే నిజమైన ఆరాధన అన్నారు. కనుక దైవం పట్ల భక్తి మాత్రమే సరిపోదు. ఆయన సూత్రాల ననుసరించడం వల్ల ఆనందమొస్తుంది. నిరాశ, నిస్పృహలను కలుగచేసి మనసుని నిర్వీర్యం చేసే దుఃఖాన్ని తప్పించుకోగలుగుతాం, ఆనందంగా జీవించగలుగుతాం.

అప్పుడే బాబా చెప్పిన “అంతటా, అన్నిటా ఉన్న బాబాను గుర్తించి, ఆ గ్రహింపుకు అనుగుణంగా వర్తించగలం.” వారికి ప్రీతిపాత్రులం కాగలం. అప్పుడే మనం ఆయన వారం. బాబాను, ఆయన మాటను, ఆయన చూపిన బాటను నమ్మిన దానికి గురుతు. బాబాను నమ్మాను అన్నది మాటలలో కాక, మన ఆలోచనలో, ప్రవర్తనలో, ఆచరణలో వ్యక్తం చేద్దాం. నా ఈ రెండు కోరికలు తీరితే బాబాను నమ్ముతాను అన్నాడు నూల్కర్. అవి తీరాక మరి ఏం నమ్మాడో, నూల్కర్ జీవితం ఎలా ఉందో గమనిస్తే అర్థం అవుతుంది. ఇక తన ముందు జీవితంలో వచ్చేవన్నీ బాబా ఇచ్చేవే అని నమ్మాడు. అలానే జీవనం సాగించాడు. మరి నమ్మడం అంటే అది కదా! ఇది గురువుగారు చెప్పిన, నడిచి చూపిన మార్గం. అదే నిజమైన సాయిపథం, సద్గురుపథం. **బాబాపథం మనల్ని దైవంగా ఎదిగించడానికే.**

**సహనం :** శబరి 11 ఏళ్ళ పిల్లగా ఉన్నపుడు తన తండ్రి చెప్పిన మాట. రామ అంటే ‘రాముడు’ వస్తాడని. అప్పటి నుండి **‘రామ’** అని స్మరిస్తూనే (పిలుస్తూనే) ఉన్నది. శబరి 92సం॥ల వయస్సులోకి వచ్చాడు శ్రీరామచంద్రమూర్తి. అంత సహనశీలి శబరి. ధైర్యోత్సాహాలతో కూడిన సహనానికి ప్రతీక శబరి, రాముడు స్వీకరించినది ఆ సహనాన్నే. మనల్ని బాబా అడిగిన ఒక పైసా దక్షిణ ఇదే.

**రెండు నిమిషాలు-ఒక్క అడుగు :** అంతా నా దగ్గరకు వస్తుంటారు పూలు, పండ్లు, కానుకలు తెస్తుంటారు. నాకు ఇవేవీ మీరు ఇవ్వనక్కరలేదు. మీరు రోజంతా 24 గంటలూ మీ లౌకిక వ్యాపారాలకు ఖర్చు పెట్టుకుంటున్నారు. ఈ పేద సన్యాసికి ఒక రెండు నిమిషాలు (త్యాగం చేయలేరా) ఇవ్వండి అంటారు కంచిపెద్దస్వామి. ఆ రెండు నిమిషాలు చాలు స్వామి మనల్ని ఎదిగించడానికి, మనం పరివర్తన చెందించడానికి. అలానే బాబా అన్నారు ఒక్క అడుగు వేయి. ఆ ఒక్క అడుగు చాలు. మనల్ని తన పథంలో నడిపిస్తూ దైవంగా ఎదిగించడానికి. ఇది వారి సమర్థత. అందుకే సద్గురుపథాన్ని రాచబాట అంటున్నాయి శాస్త్రాలు.

**- గురుకృప**

## సద్గురుకృపకు ప్రతీక ఈ గురుకృప పత్రిక



25 వసంతాలు పూర్తి చేసుకున్న 'గురుకృప' పత్రికకు మనఃపూర్వక అభినందనలు. సద్గురుకృప ఈ పత్రికమీద 25 సంవత్సరాలుగా కుండపోతగా వర్షిస్తోంది. ఆ సద్గురు అనుగ్రహ వర్షంతో సాటి సాయిభక్తులందరినీ తడుపుతూ శ్రీసాయినాథుని సాహితీ ప్రవాహంలో పయనించేటట్లు చేస్తున్న 'గురుకృప'కు జోహార్లు. పూజ్యగురుదేవులు శ్రీసాయినాథుని శరత్ బాబూజీ నోట పలికిన **అసలైన సాయిమాట, సిసలైన సాయిబాట**ను సర్వులకు అందజేయాలన్న ఆర్తికి, తపనకు సాకార రూపమే ఈ గురుకృప పత్రిక!

ఒక పత్రికను ఇన్నేళ్ళు అనవరతంగా ప్రచురించడం చిన్న విషయమేమీ కాదు. అందుకు ఎంతో కృషి, పట్టుదల అవసరం. ఎంతో మంది శ్రమ, సమయం, ధనం మిళితమై ఉంటాయి. సాయిపథం ఆదర్శాలకు అద్దం పట్టేలా, చందాల ప్రసక్తే లేకుండా ఉచితంగా (అవును ముమ్మాటికీ ఉచితంగానే) సాయిభక్తులకు అందిస్తూ, 25 ఏళ్ళుగా పత్రిక నడుస్తుందంటే, అదంతా స్వచ్ఛందంగా పనిచేస్తున్న గురుకృప పత్రికాబృందం యొక్క భక్తి బలమా? లేక శ్రీసాయినాథుని అనుగ్రహ శక్తి యొక్క విశేష ఫలమా? అని చెప్పడం కష్టమే సుమా!

**పేరు కాదు ప్రేమ ప్రధానం :** ఒక పత్రికను సజావుగా నడపాలంటే ఎన్ని కార్యకలాపాలో, ఎన్నెన్ని వ్యవహారాలో, ఎన్ని వ్యయప్రయాసలో! సాయిపథం పత్రికకు ఎడిటర్‌గా కొంతకాలం ఉన్నందున అందులోని సాధకబాధకాలు అంతా కాకపోయినా, కొంతైనా నాకు తెలుసు. పాఠకుల ప్రశంసలు ఒకింత ఊరటనిస్తే, విమర్శకుల విమర్శలు మరింత కృంగదీస్తాయి. అయితే ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా గురువుగారి ప్రేమఒడిలో ఓలలాడుతున్నంత వరకు కష్టాల కడలిమీద కమ్మని ఓడ ప్రయాణంలా ఉంటుంది. కరుణాసాగరుడు అండనుండగా కష్టమంటూ ఉంటుందా? ఈ సందర్భంగా నా స్మృతిపథంలో మెదలిన ఒక సంఘటనను పంచుకునే ప్రయత్నం చేస్తాను.

గురుకృప పత్రిక ప్రారంభమైన మొదటి రోజుల్లో ఒక సందిగ్ధం తలెత్తింది. గురుకృపలో ప్రధానంగా సాయితత్త్వాన్ని విశదపరచే వ్యాసాలే ఉండేవి. అయితే అవన్నీ అప్పటికే 'సాయిపథం' పత్రికలోగాని లేదా సాయిపథం పబ్లికేషన్స్‌లో ముద్రించిన పుస్తకాలలోగాని ప్రచురింపబడినవే. అందువల్ల చాలా మందికి సాయిపథం పత్రిక నుండి సంగ్రహించిన వ్యాసాలను మరో పత్రికలో ప్రచురించడం ఏమిటి? అన్న సందేహం కలిగింది. 'సొమ్మొకడిది సోకొకడిది' అన్నట్లు పనంతా సాయిపథం వంతయితే పేరు గురుకృప పత్రికకా అన్నట్లుంది కదూనని ఎంతో మంది వాపోయారు కూడా. అది విన్న నాకు



కూడా సబబేకదాననిపించింది. ఆ విషయాన్ని అలాగే గురువుగారికి విన్నవించాను. గురువుగారు ప్రసన్న వదనంతో ప్రశంసాపూర్వకంగా, **"వారు మంచిపనే కదా చేస్తున్నారు. చక్కగా బాబా గురించి పదిమందికి తెలియజేస్తున్నారు. అందులో అనుచితమేముంది? బాబా గురించి చెప్పడం ముఖ్యంగాని ఎవరు చెప్తే ఏమిటి" అన్నారు. మనకేమో పేరు ముఖ్యం. వారికేమో ప్రేమ ముఖ్యం. మన ధ్యాస పత్రిక ఎవరిది? ఎవరు నడుపుతున్నారన్న దానిపై ఉంటుంది. వారికేమో ఎందుకు నడుపుతున్నారు, వారి ఉద్దేశ్యం ఏమిటి?** అన్న దానిపై ఉంటుంది. అలా గురుకృప పత్రికకు గురువుగారి **"కృప"** సంపూర్ణంగా ఉన్నదని అవగతమైంది. మొదటి నుండి కూడా ప్రతి సంచిక సాయిపథం ఆవరణలోనే ఆవిష్కరింపబడటం కూడా అందుకు చక్కని తార్కాణం.

అయితే ఇక్కడొక సునిశిత విషయాన్ని జాగ్రత్తగా విశ్లేషించుకోవడం ఎంతైనా అవసరం. గురువుగారి ఆమోదం కేవలం సాయి సాహిత్యాన్ని, సాయితత్త్వాన్ని, సాయి సంప్రదాయాన్ని సాయిభక్తజనంతో పంచుకోవడానికేగాని, గురువుగారి కీర్తిని పెంచడానికి కాదు. సాయిభక్తులకు శ్రీసాయినాథుడే సద్గురువు, దైవమని ఎలుగెత్తి చాటిన గురువుగారు, పత్రికలో ఎప్పుడైనా ఎక్కడైనా గురువుగారిని సమర్థ సద్గురువుగా, దైవాంశ సంభూతునిగా ప్రదర్శించినట్లుగా వారి దృష్టికి గోచరిస్తే, తక్షణమే ఖండించేవారు. అలా ప్రచురణ కర్తలను మందలిస్తూ, సాయిపథం ఆదర్శాలను గుర్తుజేస్తూ, పత్రికా బృందాన్ని సరిదిద్దిన సంఘటనలు ఇంకా కనులముందు కదలాడుతూనే ఉన్నాయి.

బాబాకు తమ గురువుపట్లగల భక్తి, గౌరవాలు ఎంతని, ఏమని చెప్పగలం? బాబాను దర్శించేకన్నా వారి గురుస్థానాన్ని దర్శిస్తే, బాబా మరింతగా ప్రసన్నులౌతారట! గురువుగారిది అదే పంథానాయే! మనం ఎంతగా **సాయి ఊసు సాయి ధ్యాసలో** ఉండటానికి యత్నిస్తామో అంతగా గురువుగారికి ప్రీతిపాత్రులమౌతాం. అలాగే గురుకృప పత్రిక సాయిపథం ఆదర్శాలకు, అభిమతాలకు అనుగుణంగా నడచుకున్నంత వరకు సాయినాథుని కృప కుండపోతగా వర్షిస్తూనే ఉంటుంది.

గురుకృప పత్రిక దినదిన ప్రవర్ధమానమవడానికి మరో ముఖ్య కారణం కాలంతో పాటు మార్పు చెందడం. ఒకప్పుడు పత్రిక ప్రతులను ముద్రించి భౌతికంగా సాయిభక్తులకు సత్సంగాలలో అందజేసేవారు. ముద్రణ ప్రతులతోపాటు ప్రస్తుతం పత్రిక సాఫ్ట్‌కాపీలను కూడా వాట్సప్ మాధ్యమం ద్వారా దేశవిదేశాలలోనున్న సాయిభక్తులకు, సత్సంగ సభ్యులకు రెప్పపాటులో అందేలా చేస్తున్నారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, కొత్త కొత్త హంగులతో,



మారుతున్న కాలాన్నిబట్టి, అవసరాలకు అనుగుణంగా సాయితత్త్వాన్ని, గురుకృప సాయిభక్తకోటికి అందించాలని ఆశిద్దాం. గురువుగారు మనకందించిన సాయిజ్ఞానసౌరభాలతో పోలిన గురువుగారి ఆదర్శాలకు అనుగుణంగా సామాజిక స్పృహ, పర్యావరణ సంరక్షణపైగల అవగాహనను సాయిభక్తులలో పెంపొందించే వ్యాసాలను సైతం ప్రచురిస్తే ఇంకా బాగుంటుందేమో!

“అనుగ్రహించడమే నా పని” అన్నారు బాబా. గాలికంటే సూక్ష్మమైన అనుగ్రహం అంతటా వ్యాపించి ఉంది అన్నారు భగవాన్. అనుగ్రహం అంతటా ఉన్నా, సాయి ఎప్పుడూ అనుగ్రహిస్తూనే ఉన్నా, అదేమి దౌర్భాగ్యమో మనం అందుకోలేకపోతున్నాం. ఈ గురుకృప పత్రిక ప్రతి సాయిభక్తునికి అందాలని, సద్గురుకృపను అందించాలని, అందరూ ఆ కృపారసాన్ని ఆస్వాదించి, అనుభవించి తన్మయులై ఆనందంగా నర్తిస్తూ, **“సాయివంటి దైవంబు లేడోయి లేడోయి”** అని ఏక కంఠంతో గానం చేయాలని, అటువంటి **గురువుగారి ఆశయ సాధనకు గురుకృప ఆలంబనం కావాలని** మనస్ఫూర్తిగా అర్థిస్తూ రజతోత్సవం జరుపుకుంటున్న ‘గురుకృప’ పత్రికకు మరొక్కసారి నా హృదయపూర్వక ధన్యవాదములు.

– సాయినాథుని నారాయణరావు

## ఆ నామం.. ఆనంద జీవన అమృత గానం...

**జీవన పయనంలో ‘ప్రేమ’ పరిమళించిందంటే**
**మీ నామ మహిమే కదా గురుదేవా!**
**మలిన పంకిలమైన అంతరంగం కొంతైనా క్షాళన అయిందంటే**
**మీ నామ మహిమే కదా గురుదేవా!**
**వివేక, విచక్షణలను కోల్పోకుండా మాలో విలువలు విన్పిస్తున్నాయంటే**
**మీ నామ మహిమే కదా గురుదేవా!**
**సాటివారికి హాని చేసే ఆలోచన కలిగితే హెచ్చరిక గంటలు మ్రోగుతుంటే**
**మీ నామ మహిమే కదా గురుదేవా!**
**తనువు పులకించి, మనసు ఉప్పాంగి కొన్ని క్షణాలైనా ‘ఆనందం’ పొందామంటే**
**మీ నామ మహిమే కదా గురుదేవా!**
**చేసిన తప్పుల పశ్చాత్తాపంలో కుమిలే వేళ పావనమవుతామన్న ధైర్యం**
**మీ నామ మహిమే కదా గురుదేవా!**
దేవా! మీ నామ స్మరణలో గుట్టుగా మీ చరణాలను చేరేట్లు దీవించండి...
మీ ఈ బిడ్డలందరినీ సాయి అనంతప్రేమ సంద్రంలో ఓలలాడించండి..

**... సద్గురునంది...**



## మనలోని బలహీనతలను పోగొట్టుకోవడం ఎలా?

**గురుబంధువు :** అందరూ శ్రేష్ఠులుగా ఉండాలనే కోరుకుంటారు కదా సార్! కానీ వాళ్ళకి ఉండేటువంటి బలహీనతలుగాని, అలవాట్లుగానీ, ఇతర పరిస్థితుల వల్లగాని వాటిని పోగొట్టుకోవడానికి ఎంత ప్రయత్నం చేసినా జీవితంలో ఈ బలహీనతలు వెంటాడుతూ ఉంటాయి. అసలు ఈ బలహీనతలు ఎందుకు ఏర్పడతాయి? ఈ బలహీనతలు ఏర్పడినపుడు వాటిని ఎలా పోగొట్టుకోవాలి. సాధనా పరంగా ఇవి అడ్డమొస్తుంటాయి కదా, ఏం చేయాలి?

**గురువుగారు :** బలహీనతలు ఒక్కొక్కరికి ఒక్కొక్క కారణంగా ఏర్పడతాయి. అందరికీ అన్ని బలహీనతలూ ఒకే కారణంగా ఏర్పడవు. బలహీనతలు ఎందుకు ఏర్పడ్డా, అది బలహీనతే. మనం పోగొట్టుకోవాలనుకున్నపుడు బలహీనతను పోగొట్టుకునే ప్రయత్నమే ఇదంతా! అదేగా ఇప్పుడు చెప్పింది నేను. బాబా దగ్గరకు రావడం ద్వారా, ఆయన చెప్పింది మనం ఆచరిస్తూ, ఆయన అనుగ్రహానికి పాత్రులవడం ద్వారా మన బలహీనతలు పోతాయి. **సత్సంగం చేసుకునేది అందుకే. ధ్యానం చేసుకునేది అందుకే. బాబా దగ్గరకు పోయేది అందుకే. మన ప్రయత్నమంతా అందుకే. మనలో బలంగా ఉండేటువంటి బలహీనతల్ని పోగొట్టుకునేదానికి.**

**గురుబంధువు :** ఎవరికైనా చెడు అలవాట్లు, ఉదాహరణకు త్రాగుడు అలవాటు ఉందనుకుంటే, ఒకసారి త్రాగాలనేటువంటి కోరిక వచ్చినపుడు ఒకసారి త్రాగేసి వదిలి పెట్టేస్తే బాగుంటుందా?

**గురువుగారు :** వదిలిపెట్టగలిగితే బాగానే ఉంటుంది.

**గురుబంధువు :** పతనం కావడం అంటే ఏమిటి సార్?

**గురువుగారు :** 'పతనం' అనేటువంటిది జనరల్‌గా వీడు పతనమైనాడని చెప్పేదానికి ఏం ఆధారాలు లేవు. మనకొక లక్ష్యం ఉండాలి. ఎవరికైనా ఒక లక్ష్యం అనేది ఉండి, ఒక రిఫరెన్స్ పాయింట్ ఉండాలి. ఈ లక్ష్యానికి మనం చేరుకునేదానికి మనం ముందుకు పోతున్నామా? వెనక్కి పోతున్నామా అనే దానిమీద వాడి పతనం ఆధారపడి ఉంటుంది. ఆ రిఫరెన్స్ పాయింటును బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క దృష్ట్యా చూస్తే వాడికి పతనమవుతుంది. ఇంకో దృష్ట్యా చూస్తే పతనం కాదు. డబ్బులు బాగా సంపాదించాలి అనేటువంటి గమ్యం పెట్టుకుని, వాడేదో కోటి రూపాయలు సంపాదించుకోవాలి అనుకున్నాడు, ఇరవై నాలుగు గంటలూ కూర్చొని వ్యాపారం చేస్తున్నాడు. ఇంకొకడు 24 గంటలూ నా మనసులో బాబా తప్పితే ఇంకేమీ ఉండకూడదు అంటూ, బాబా ధ్యానంలో ఉన్నాడు. వీడికి 24 గంటలూ వ్యాపారం చేసేవాడు పతనమైనట్లుగా కనిపిస్తాడు. వాడికి పనీ పాటా లేకుండా కూర్చున్నవాడు



పతనమైనట్లుగా కనిపిస్తాడు. కాబట్టి పతనమనేటువంటిది, రెలెటివ్‌గా (సాపేక్షత) జనరల్‌గా చెప్పేటువంటిది. కోటి రూపాయలు సంపాదించాలనుకుని, వ్యాపారం చేయాలనుకొని నిద్రపోతాడు. వ్యాపారానికి పొమ్మంటే సినిమాకి పోతాడు. ఫ్రెండ్స్‌తో కలసి పార్టీల్లో కూర్చుంటాడు. తలకి మించి ఖర్చు పెడతాడు. లెక్కలు చూసుకోడు. బుద్ధి పుట్టదు. నానారకాల వ్యసనాలకు అలవాటు పడతాడు. అది వాడి దృష్ట్యా వాడికి పతనం. మనం అనుకున్న లక్ష్యానికి, ఆ లక్ష్యంవైపుకి మనం వేసే స్టెప్పుకి చేరుకోనివ్వకుండా క్రింద ఉండటమనే దానిని **'పతనం'** అంటారు.

**గురుబంధువు :** సార్! **'నా భక్తుడిని నేనెన్నటికీ పతనం కానివ్వను'** అని బాబా అన్నారు కదా! అది ఎలా?

**గురువుగారు :** ఈ బలహీనతల్ని వాడిలో నుంచి తీసేసి వాడి గమ్యం వైపుకి వెళ్ళే దానికి దోహదం చేస్తారు. సహాయం చేస్తారు.

**గురుబంధువు : 'నా సాంప్రదాయమే వేరు'** అని, **'ఎక్కడ ఉన్నా, నా భక్తుడిని నేను పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కుంటాను'** అని బాబా చెప్పారు కదా, దాంట్లో **'నా సాంప్రదాయమే వేరు'** అంటే?

**గురువుగారు :** ఆయన **'నా సాంప్రదాయమే వేరు'** అని చెప్పింది, ఎప్పుడు చెప్పారంటే, ఆయన దగ్గరకొచ్చి మంత్రోపదేశం అడిగినపుడు చెప్పారు. ఒక భక్తురాలొచ్చి, నాకు మంత్రోపదేశం చేయాలి అని పట్టుబట్టి కూర్చుంది.

మామూలుగా సాంప్రదాయం ఏంటంటే, మంత్రోపదేశం చేసేటువంటివాడు గురువు అని అర్థం. కాబట్టి ఆయన, "నా గురువు నాకేం మంత్రోపదేశం చేయలేదమ్మా. దృష్టితోనే, ఆలోచనతోనే ఉద్ధరిస్తానన్నారు. అందుకని, నా సాంప్రదాయమే వేరు, నేను ఎవరి చెవిలోనూ, ఏ మంత్రమూ ఉపదేశించను". ఆ దృష్టితో చెప్పిన మాటది. మామూలుగా **మంత్రోపదేశం, శిష్యుడు, గురువు అనేటువంటి ఈ పద్ధతి కాదు నాది, వేరే పద్ధతి అని చెప్పారు.**

**గురుబంధువు : 'నా ఆజ్ఞ లేకుండా ఆకైనా కదలదు'** అని అనడంలో ఉద్దేశ్యం ఏమిటి సార్?

**గురువుగారు :** ఆయన ఆజ్ఞ లేకుండా ఆకైనా కదలడం, కదలకపోవడం ఆయన అనుభవం అది. నీకు తెలుస్తుందా, ఆకు కదిలేటప్పుడంతా, బాబా ఈ ఆకుని కదిలిస్తున్నారని నీకు తెలుస్తుందా? నీ అనుభవమా అది? నీ అనుభవంలో నీ బలహీనతలు, నీ బలాలు రెండూ నీవే! నీ అనుభవం ఏమిటి? నీ అనుభవం ప్రకారంగానే నువ్వు నడచుకో. అందుకని మహాత్ములు చెప్పినటువంటి



మాటల్ని మన అనుభవాల దృష్ట్యా అన్వయం చేసుకొని అర్థం చేసుకోవాలి.

**గురుబంధువు :** 'పతనం కానివ్వను' అని బాబా అస్యూరెన్స్ ఇచ్చారు కదా సార్, అంటే మనం పతనమయ్యే అవకాశం ఉండదు కదా, మనం బాబా మాటని ఒక శాసనంగా తీసుకోవాలా?

**గురువుగారు :** అవును, శాసనమే. బాబా చెప్పారు కాబట్టి శాసనమే అది. మధ్యలో ఏంటనంటే తప్పటడుగులు వేసినట్టుగా కొంచెం పడుతుంటాం. ఒక్కరవ్వ లాంగ్ రోప్ ఇచ్చి, వాణ్ణి మళ్ళా పైకి తీసుకొస్తారాయన. మళ్ళా వాడినేమీ వదిలిపెట్టరు. ఇప్పుడు పిల్లవాడున్నాడు. టి.వి. విపరీతంగా చూస్తున్నాడు, వాణ్ణి టి.వి. చూడొద్దురా అన్నాము. ఒప్పుకోడు. సరేరా, ఈ వారం రోజులు చూడు, లేకపోతే ఆదివారం చూడు, లేకపోతే వారానికి రెండ్రోజులు చూడు అని కన్సెషన్ ఇస్తాం. అట్లా కొంతమందికి కన్సెషన్స్ ఇస్తారు. రెండ్రోజులు చూడమ్మా అనంటే, దానికి వారం రోజులు చూస్తూ పరీక్షలే ఎగ్గొట్టాడనుకో మొత్తానికి. టి.వి. తీసి పారేస్తాం, కనెక్షన్లు తీసేస్తాం. అట్లా అదీ చేస్తారు. ఎట్లా చేయాలో ఆయన ఒకొక్క వ్యక్తికి ఒక్కో రకంగా చేస్తారు. కాబట్టి ఎవ్వరూ పతనం కారు.

**గురుబంధువు :** ఒకటి, రెండుసార్లు చెప్పి చూస్తాను. వినకపోతే వాళ్ళ ఖర్మకు వదిలిపెడతాను, అని బాబా అన్నారు కదా సార్!

**గురువుగారు :** ఆయన మామూలుగా అన్న మాటది. ఆయనేమీ వదిలెయ్యడు. మామూలుగా ఆయన దగ్గరకు వస్తూ, త్రాగుడు అలవాటై వచ్చినటువంటి వాడితో మామూలుగా మనం చెప్పే మాటల్లాగా చెప్పారంతే. అనేదానికి అంటూనే ఉంటారు.

ఎంతోమంది వచ్చారు ఆయన దగ్గరకి. వాడి ప్రారబ్ధంలో వీడికి తగ్గాల్సిన ఇది లేదు, యోగం లేదు, నేనేం చేయలేను పో అన్నారు. మళ్ళా వాళ్ళిక్కడికి వచ్చి, మళ్ళా మళ్ళా ప్రార్థన చేస్తే, సరేరా నీ ప్రారబ్ధం నిన్నేం చేస్తుందని చెప్పి కాపాడలేదా? పిల్లలతో కూడా ఏమంటాం మనం. మన మాట వినకపోతే? నేను చెప్పదలచుకుంది చెప్పాను. ఇంకోసారి చెప్తాను. రెండుసార్లు చెప్తాను. లేకపోతే నీ ఖర్మ. బాగుపడాలనుకుంటే బాగుపడతావు. లేకపోతే చెడిపోతావు పో అనంటాం. నిజంగా వదిలిపెడుతున్నామా? మళ్ళా రెండోరోజు నుంచి మళ్ళా వాడి వెంటపడుతున్నాము. అంతే ఆయన కూడా.

**గురుబంధువు :** సంస్కరింపబడటం అంటే ఏంటి సార్?

**గురువుగారు :** సంస్కారమంటే కరెక్ట్‌గా ఆ పదానికర్థం ఏమిటనంటే, ఒక ఆర్డర్లోకి తీసుకురావడం.



తల దువ్వుకోవడం అనేదాన్ని సంస్కారం అంటాము. తలంతా గజిబిజిగా ఉంది. చిక్కుచిక్కుగా ఉంది. మనం తలదువ్వుకుంటాము కదా, ఈ దువ్వుకునేటువంటి ప్రక్రియ. ఇది సంస్కారం. అట్లాగే మనలో ఉండేటువంటి రకరకాల కోరికలు, రకరకాల అభిప్రాయాలు ఇవన్నీ కూడాను చిక్కుముడుల్లాగా ఉంటాయి. వీటన్నింటినీ ఒక క్రమంలోకి తీసుకురావడంతో వాటికి బలమేర్పడుతుంది. దాన్ని సంస్కారం అంటాము. ఇనుముకు, అయస్కాంతానికి ఉండేటువంటి తేడా ఏమిటి? నిజానికి చెప్పాలంటే ఫిజికల్‌గా ఏం తేడా లేదు. ఇనుములో ఉండేటువంటి ఐరన్‌మాలిక్యూల్స్ గజిబిజిగా ఉంటాయి. ఒక దాని యొక్క మేగ్నటిక్ ఫీల్డ్స్‌ని ఇంకొకటి అడ్డుకుంటాయి. గందరగోళంగా ఉంటాయి. ఇనుపముక్కని తీసుకుని దానిపై అయస్కాంతంతో రుద్దుతూ వచ్చామనుకో. రుద్దుతూ వచ్చేటప్పటికి నార్త్, సౌత్ పోల్స్ ఉండేటువంటిదంతా కూడా ఒక ఆర్డర్లో వస్తుంది. ఒక వరుసలోకి వస్తాయి. వరుసలోకి రాగానే అది మేగ్నెట్‌గా అయిపోతుంది. ఇట్లా రుద్దడం ద్వారా దీంట్లో ఉండే అయస్కాంత శక్తి దాంట్లో ఏమీ ప్రవేశించదు. ఆ ఇనుపముక్కలో ఉండేటువంటి అయస్కాంత శక్తి ఉంది ఉండటానికి, అయస్కాంతమే అది. కానీ దాని అయస్కాంత శక్తి పనిచేయడం లేదు. మనలో ఉండేటువంటి శక్తులుగాని, సామర్థ్యాలుగాని మనలో ఉండే కోరికలు గానీ అట్లా ఉన్నాయి. ఇనుపముక్కలో ఉండేటువంటి మాలిక్యూల్స్‌లాగా ఉన్నాయి. ఇవన్నీ కూడాను అయస్కాంతంలాంటి బాబా దగ్గరకు పోయి, ఆయనను మళ్ళా మళ్ళా స్మరణ చేసి, ఆయన్ను ధ్యానం చేసి, ఆయన గురించి పారాయణ చేసి, ఆయన నామం చేసుకుంటూ, అంటే ఆ అయస్కాంతంతో రుద్దడం.

అలా రుద్దుతూ, రుద్దుతూ పోగా మనలో ఉండేటువంటి ఈ వాసనలంతా కూడా ఒక ఆర్డర్లోకి వచ్చి, మనం ఒక అయస్కాంతం క్రింద మారిపోతాం. ఇదే సాధన, సత్సంగం, స్మరణ అన్నీ, మనం ఇక్కడ చేసేది కూడా అదే. ఆ ఇనుపముక్కలుగా ఉండేటువంటి మనం అయస్కాంతంగా ఉండేటువంటి ఆయన చేత కాంటాక్ట్‌లోకి వచ్చి, మనం కూడా అయస్కాంతంగా మారడానికి ప్రయత్నం చేస్తున్నాం.

ఇంతకీ ఏమి జరుగుతుంది? క్రొత్తగా ఆయనలో ఉండే శక్తి ఇక్కడికేమీ రావడం లేదు. మనలో ఉండేటువంటి అయస్కాంత శక్తే మేల్కొంటుంది. ఎలాగ? మనలో ఉండేటు వంటి రకరకాల కోరికలు, మనలో ఉండేటువంటివి సంస్కరింపబడటం ద్వారా. అదీ సంస్కరింపబడటం.

**గురుబంధువు :** ఆ ప్రక్రియ మావల్ల సాధ్యం కాదు కదా, సార్?



**గురువుగారు :** సాధ్యం కాదు, అందుకనేగా అయస్కాంతం కావాలి. ఇనుము అట్లాగా ఉంటే, కొన్ని  వేల సంవత్సరాలైనా అట్లాగే ఉంటుంది. అది ఇనుముగానే ఉంటుంది. దానికొక అయస్కాంతం కావాలి. అయస్కాంతం ఉంటేనే ఇది అయస్కాంతం అవుతుంది. అవుతుందా అంటే అవుతుంది. ఇనుముగా ఉన్నంతవరకు అవుతుంది. అది ఇనుమైతే అయస్కాంతమయ్యే లక్షణం ఎప్పుడూ ఉంది. దానికి ప్రిన్సిపుల్ ఉంది. సూత్రప్రాయంగా దానికా పాజిబిలిటీ ఉంది. కానీ అయస్కాంతం దొరకాలి. దొరికినా అయస్కాంతం కాంటాక్ట్‌లో ఉండాలి.

**గురుబంధువు :** ఇనుము తన సహజస్థితిని కోల్పోయి, ఇనుములాగా కాకుండా పోయే అవకాశం కూడా ఉందా సార్?

**గురువుగారు :** అట్లా ఏమీ కాదు.

**గురుబంధువు :** కాంటాక్ట్‌లో ఉండాలంటే ఏం చేయాలి సార్?

**గురువుగారు :** చెప్పానుగా, ఇప్పుడు వరుసగా ఒక పెద్ద లిస్ట్ చెప్పాగా.

**గురుబంధువు :** ప్రేమను పెంచుకోవడం ఎలా సార్?

**గురువుగారు :** కాంటాక్ట్ ద్వారానే పెరుగుతుంది. నాలుగుసార్లు అయస్కాంతంతో రుద్దినపుడు, అయస్కాంతం మనలో ఉండేటువంటి మన ప్రేమను... మనకు ప్రేమ ఉంది. దానిని మనలో ఉండేటువంటి ఈ గజిబిజి వల్ల మనం అనుభవించలేకపోతున్నాము. వ్యక్తం చేయలేకపోతున్నాం. ఈ అయస్కాంతంతో కొద్దిగా గానీ, ఒక ఆర్డర్లోకి రాగానే మనలో ప్రేమ పుడుతుంది. అయస్కాంత శక్తి పెరుగుతుంది. ఇంకాసేపు రుద్దితే ఇంకా కొంచెం పెరుగుతుంది. ఎంతసేపు? పూర్తిగా అయస్కాంతం అయిపోయేంత వరకు. ఆ అయస్కాంతశక్తినే మనం 'ప్రేమ' అని కూడా అంటాం. ఆ ప్రేమే ఇనుపముక్కను అయస్కాంతం దగ్గరకు లాగేది. ఇనుపముక్కకి అయస్కాంతమంటే లవ్ (ప్రేమ). అయస్కాంతానికి ఇనుపముక్క అంటే లవ్. ఈ మధ్యలో ఉండే ఆకర్షణ శక్తి ప్రేమ.

**గురుబంధువు :** మనకు ఇనుములాగా ఉండే లక్షణముంటుందా?

**గురువుగారు :** ఉంటుంది. మనలో ఆలోచించే, ఎరుక అనేటువంటిది, తెలుసుకోవడమనేది ఉంది చూసావా, దాన్నే ఇనుపముక్క అంటాం. ఏమిటి? ఈ కుర్చీ, ఈ గుడ్డ, వీటిని గురించి ఆలోచించడం లేదు మనం. మనం ఇనుము, ఇవి ఇనుము కాదు. మనం ఎలా ఇనుము అనంటే, మనకు తెలుసుకోవాలనేటువంటి ఎరుక ఉన్నది. దుఃఖపడుతున్నాము, సంతోషపడుతున్నాము, ఆనందం



కోసం తపిస్తున్నాము. దొరక్కపోతే ఏడుస్తున్నాము. ఈ లక్షణాలన్నీ ఉండేటువంటిదాన్ని మనం ఇనుము అంటున్నాం.

**గురుబంధువు :** ఇనుముతో మనం అంటే బాబాతో కాంటాక్ట్ ఉండటం నేచురల్‌గా రాదంటారా?

**గురువుగారు :** అర్థం కాలేదు

**గురుబంధువు :** బాబాతో అట్లా కాంటాక్ట్ ఉండటానికి, మనం ట్యూన్ కావడం అనేది ఎలా చేయాలి?

**గురువుగారు :** సరైన కాంటాక్ట్ ఉండటం అవడం కాంటాక్ట్. బాబాతో కాంటాక్ట్‌లో ఎట్లా ఉంటావు నువ్వు? ఫోన్ చేస్తావా రోజూ. మరి ఎట్లా చెప్పు. కాంటాక్ట్ అంటే ఎలా? ఈ-మెయిల్ ఇస్తావా? మరి ఎలా? అదే ట్యూనింగ్ అంటే! ***– గురుదేవుల అనుగ్రహభాషణం నుండి...***

# గురుకృప రజతోత్సవం

గురుకృప తన 26వ జన్మదిన సందర్భమున నమస్సులు సమర్పించుచున్నది. గురుచరణములకు ఈ రజతోత్సవ సంచిక భక్తితో సమర్పింతుము.

**శ్లో ॥ పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యు పహృత మశ్నామి ప్రయతాత్మనః** (గీతోపనిషత్)

**తాత్పర్యము :** భక్తిపూర్వకముగా నాకు ఒక పత్రమునుగాని, పుష్పమునుగాని, ఫలమును గాని, నీటినిగాని ఎవరందించినను నేను స్వీకరించి అనుగ్రహింతును.

**వివరణము :** ఆరాధనకుగాని, అనుసంధానమునకుగాని, యోగసాధనకుగాని ప్రధానముగా వలసినది భక్తి. భక్తియున్నచోట హృదయం నిర్మలమై యుండును. ఆరాధనయందు అనురక్తియుండును. అట్టి అనురక్తి ఎదుటి జీవునికి ప్రీతి కలిగించును. ఆ జీవుని యందలి దైవమునకు కూడా ప్రీతి కలిగించును. ఇట్లు జీవుల యందలి దైవమునకు ప్రీతి కలిగించు రీతిలో ప్రవర్తించుట వలన దైవము ప్రీతి చెందును. "అంతటా, అన్నిటా ఉన్న నన్ను గుర్తించి, ఆ గ్రహింపునకు అనుగుణంగా వర్తించువారు నాకు ప్రీతిపాత్రులు" అన్నారు కదా బాబా. ఎవ్వరికైనను తాగు నీరిచ్చినపుడు, ఒక ఫలము నిచ్చినపుడు, ఒక పుష్పము నిచ్చినపుడు, ఒక తులసిదళమో, మారేడు దళమో ఇచ్చినపుడు ఆ జీవుని యందలి భగవంతుని దర్శించుము. జీవేశ్వరులకు ప్రీతి కలుగునట్లుగా అందించవలెను. అట్లందించినపుడు జీవుడే కాక, అందలి భగవంతుడు కూడా ప్రసన్నుడగును. భక్తితో సమర్పించుట అనగా ఎదుటిజీవుల



యందలి భగవంతుని కూడా దర్శనము చేయుచూ, వినయముతో, శ్రద్ధతో సమర్పించవలెను. అట్టి శ్రద్ధ, వినయము లోపించినపుడు అది భక్తి కానేరదు. ఎంత విలువైన వస్తువులందించినప్పటికీ భగవంతుడు ప్రీతి చెందడు. భక్తితో ఏమిచ్చినను దైవము అంగీకరించును. అట్లు చేసినచో అది **'భక్తి'** నివేదనమగును. "నేను మీరిచ్చే పదార్థాలను స్వీకరించను, వాటి వెనుక ఉన్న ప్రేమనే స్వీకరిస్తాను" అంటారు శ్రీబాబూజీ.

నిజమునకు భగవంతునకు వలసిన దేమియూ లేదు. ఎంత ధనముతోనైనను భగవంతుని మెప్పించలేము. భగవంతుడు కోరినది భక్తిధనమేగాని, ధనము కాదు. భగవంతుని బలముతో కూడా మెప్పించలేము. భక్తి బలమే నిజమగు బలము. దానివలన భగవంతుడు ప్రసన్నుడగును. అట్లే ఎట్టి విద్యలతోను కూడా దైవమును మెప్పించలేము. భక్తి విద్య యొక్కటే దైవమును మెప్పించగలదు. ఎవరికి ఏ పని చేసిపెట్టుచున్ననూ వారి యందలి దైవమును దర్శించుట వలన భక్తి, ప్రేమలు జనించును. అట్టి బుద్ధితో చిన్న పనియైనను, పెద్దపనియైనను చేయవలెను. చిన్నవారికైనను, పెద్దవారికైనను అదే విధముగు శ్రద్ధా భక్తులతో చేయవలెను. శ్రద్ధ వలన జ్ఞానము, భక్తి వలన అనుగ్రహము లభించును. (లక్ష్మీభాయి షిండే తెచ్చిన రొట్టెలను కుక్కకు పెట్టిన వృత్తాంతం)

లోకమందు కూడా తల్లిదండ్రులు పిల్లల నుండి ఆశించునది ప్రేమాభిమానములే గదా! అట్లే దైవము కోరునది శ్రద్ధాభక్తులే! దైవమునకు శ్రద్ధాభక్తులు ఎట్లు సమర్పింపగలము? దైవము అన్ని జీవుల హృదయమునందున్నాడు గనుక జీవులకు చేయు సేవ రూపమున తానందుకొనుచున్నాడు. కనుక భక్తులు, జ్ఞానులు, యోగులు, విరాగులు కూడా జీవుల రూపమునున్న దైవమును సేవించి అనుగ్రహమును పొందవలెను. ఇట్టి ప్రయత్నం నిరంతరం సాగుచుండవలెను. ఇదే నిష్ఠ. నిజమునకు వారికి వలసిన దేమియు లేదు. కనుక వారు కోరినది సమర్పించుటే మన ధ్యేయం కావలయును.

ఈ శ్లోకమున "ప్రయతాత్మనః" అని–దైవము ప్రయత్నం చేయువాని గూర్చి పలికెను. ఆ పదము ప్రయత్నశీలుని గూర్చి ఉద్దేశింపబడనది. ఆ పదమునకు నిర్మల అంతఃకరణుడని కూడా అర్థమున్నది. కేవలం నిత్యము జీవుల సేవ చేయుట మాత్రం చాలదు. అట్టి ప్రయత్నం చేయువాని అంతఃకరణము నిర్మలమగుచుండవలెను. అంతఃకరణము అనగా లోమనస్సు, బుద్ధి, అహంకారము జీవులసేవ నిత్యము చేయుచున్నపుడు పై మూడు నిర్మలము కావలెను. కేవలం బహిఃకరణములతో చేయు సేవ నిరుపయోగము. జీవ సేవా కార్యము నిర్వర్తింపబడుతున్న కొద్దీ ఋజువర్తనము, ధర్మాచరణము, బుద్ధి ప్రకాశము, నిరహంకారం ఆవిష్కరింపబడుచుండవలెను. అంతఃకరణ శుద్ధి లేని వానికి



దైవానుగ్రహం ఎండమావి యందలి జలమువలె యుండును. నిర్మల అంతఃకరణుడై భక్తిశ్రద్ధలతో ఎదుటిజీవి యందు దైవ దర్శనము చేయుచూ ఏమిచ్చిననూ దైవము ఆనందించును. ఇది సత్యము.

స్వస్థత పొందిన వారి కళ్ళల్లో, వారి కుటుంబం పొందే ఆనందపు అనుభూతుల్లో గురువు కనిపిస్తూనే ఉన్నారు. ఆశీర్వదిస్తూనే ఉన్నారు. గురుపదాలను దర్శించుచూ, వినుచూ, ఇతరులకందించు ప్రయత్నం సాగినంతకాలం గురుపదము అర్థవంతమై యుండును. గురుపదాలనే గురుకృపగా స్వీకరించి, ధరించి, ఆస్వాదనతో గమ్యం చేరుదుము గాక!

తమ జీవన గమనాన్ని మలుపుతిప్పిన గురువును తొలిసారిగా కలిసాక, తదనంతరం తమ జీవితాలలో, జీవనంలో గురు ప్రభావంతో కర్మాచరణ సాగుతున్నదా అన్న గమనింపులో తమ గమనం సాగిస్తూ గమ్యం చేరాలి. అదే మన **"ఒకే ధ్యేయం. ఒకే మార్గం. ఒకే గమ్యం"** కావాలి. గురువాక్యముననుసరించుటకే ఆరాధన, జయంతి ఉత్సవాలు. గురువును అనుసరించాలనే ఉత్సాహమే ఉత్సవం. గురుచరితను పఠించుట గురువును అనుసరించుటకే. వారి మాటలను పాటించుటకే. అది ఉత్తమం. అటులనే ఉత్తమ మార్గం అయిన సద్గురుపథంలో పయనించగలము.

**– గురుకృప**

## కులాల కుళ్ళు - మతాల మళ్ళు

**భక్తుడు :** రైల్లో కూర్చోగానే మీరు ఏమిటోళ్ళు? అని అడుగుతారు ఫస్ట్. అప్పుడు ఏమి చెప్పాలి.

**గురువుగారు :** నేను సాయిభక్తుడిని అని చెప్పు. నాకు కులమంటే అసహ్యమండి. నాకు కులమేమీ లేదు. నాకేదో కులముంది కానీ, ఆ కులం మీద నాకేమి ఇది లేదు. మీరు ఏమిటోళ్ళు అని అడిగారు కనుక, నేను సాయిబాబాఓళ్ళు అని చెప్పు.

**భక్తుడు :** ఎక్కడడిగినా మనం ఆ విధంగా చెప్పగలిగి ఉండాలి కదండి.

**గురువుగారు :** ఏం ఎక్కడడిగినా చెప్పడానికి భయమా ఏమైనా?

**భక్తుడు :** లేదు సార్... సాయిపథంలోనే కాకుండా బయట ఎక్కడైనా...

**గురువుగారు :** బయట ఎక్కడైనా చెప్పాలి. ఇంకా బయటే చెప్పాలి ఎక్కువ, సాయిపథంలో కాదు. ముందు వాళ్ళకు అది నచ్చదు. నిన్ను లాగడానికి ప్రయత్నం చేస్తారు. నిన్నొక పిచ్చోడనుకుంటారు. అనుకోని, కాని రేపొద్దున మళ్ళా నీ దగ్గరకే వస్తారు. నీలో ఉండే మనోస్థైర్యాన్ని చూసి, ఇక్కడన్నీ మాట్లాడుతూ బయటికి పోయిన తరువాత మనం మనం ఒకటే కదా! ఎందుకంటే కొన్ని లాభాలు



ఉంటాయి. కొన్ని సొసైటీస్, కొన్ని దగ్గర ఏదన్నా ఒక జాబ్‌లోకి పోవాలన్నా, అక్కడొక ప్లేస్‌మెంట్ కావాలన్నా, ఆ ప్లేస్‌మెంట్ ఇచ్చే వ్యక్తి నీ కాస్ట్ వాడు అయ్యుంటే, కొంచెం మనోళ్ళు మనోళ్ళు చూసుకోకపోతే ఎట్లా సార్ అని అంటాం. మళ్ళా అట్లా ఉపయోగాలు కొన్ని ఉపయోగపెట్టుకుంటాము. వీలైనంత వరకు అట్లాంటి ఉపయోగపెట్టుకోవడాలు ఆపెయ్యండి. ఒక లాభమొచ్చినా మనం పోగొట్టుకోవడానికి సిద్ధపడుతుంటే, మన ఇది చూసి బాబానే ఇవ్వాలని అనుకుంటే ఇస్తారు. లేకపోతే ఇంక ఈ కక్కుర్తికి, దరిద్రానికి అంతం లేదు. ఇంతవరకు మనకు ఏమీ తెలియకుండా, మన ప్రమేయమేమీ లేకుండా ఒక కులంలో పుట్టేసాము. ఇంతకంటే వేరే ఏమీ క్వాలిఫికేషన్ లేనట్లు, నువ్వు ఏమిటి అనంటే, నేనొక కమ్మ, బ్రాహ్మణ, రెడ్డిని అని చెప్పుకుంటున్నావంటే సిగ్గుపడొద్దు మనం? నీకంతకంటే ఏమీ లేదన్న మాట, వేరే క్వాలిఫికేషన్. నీకున్న క్వాలిఫికేషన్ అదొక్కటే.

**భక్తుడు :** సోషల్‌గా మనం అవతలకి వెళ్ళినపుడు ఇతరులతో కలిసినపుడు ఈ భావాలు వస్తుంటాయి కదా, సాయిభక్తునిగా మనం ఎట్లా దానిని అప్రోచ్ అవ్వాలి?

**గురువుగారు :** అవి వస్తున్నాయి అనంటే, సాయిభక్తుడు కాదని అర్థం.

**భక్తుడు :** వేరే వాళ్ళతో ఇంటరాక్ట్ అయినపుడు?

**గురువుగారు :** ఎవ్వరితో ఇంటరాక్ట్ అయినా సరే, ఇలాంటివి వస్తున్నాయి అనంటే మాత్రం మనం ఇంకా సాయిభక్తులం పూర్తిగా కాలేదని అర్థం. ట్రై చేస్తున్నాం కావడానికి. ఇవన్నీ ఉన్నాయి కాని, నువ్వు సాయిబాబా భక్తుడివి అయితే మాత్రం ఏమి? మన కాస్ట్‌ప్రకారం మనం చేసుకుంటాం. మన కాస్ట్ వాళ్ళమంతా కలసి సాయిపథంలో ఒక గ్రూపు తయారుచేస్తాము అని అంటారు. అలా సాయిపథంలో మళ్ళీ కాస్ట్‌గ్రూపులు తయారవుతాయి. లేకపోతే జడ్జ్ చేయడం, చూడు గురువుగారి దగ్గర ఎవరున్నారో ఎక్కువ లెక్కెయ్యండి అని అంటారు. అసలు ఆ ఆలోచన, ఆ ఐడియా కూడా రాదు నాకు. ఒక్కొక్కటైంలో ఒకరుంటారు. ఇంకో టైంలో ఇంకొకరుంటారు. వాళ్ళ వాళ్ళ ఆర్తినిబట్టి, అక్కడుండే అవకాశాన్ని బట్టి ఉంటుంది. అదిగో చూడు ఇప్పుడు కార్లో బయలుదేరినారు కదా చూడు ఎవరెవరున్నారో చూడు, లెక్కెయ్యి. ఇది అక్కడుండే పరిస్థితి. ఆ దరిద్రాలకింక అంతులేదు. ఎందుకంటే మనకు అంత అలవాటు అయిపోయింది మన థింకింగ్, ఆ లైన్లో ఆలోచించడం, మనిషిని మనిషిలాగా చూడకుండా వాడు ఏమిటోడు అని చూడటం.

***– శ్రీబాబూజీ అనుగ్రహభాషణాల నుండి***



## ఆనందపూర్ణుని పుష్కర ఆరాధన

పూజ్య గురుదేవులు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ మహాసమాధి చెంది 2022, నవంబరు 13 తేదికి 12 సంవత్సరాలు పూర్తయ్యాయి. 12 సంవత్సరాలు...కాల గమనంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ ఎన్నో మార్పులు, చేర్పులు జరిగాయి. శ్రీబాబూజీ నింపిన స్ఫూర్తితో నిరంతరం సద్గురు ప్రేమ వ్యక్తీకరణలో నూతనత్వాన్ని అన్వేషిస్తూ, ఆవిష్కరిస్తూ 'సాయిపథం' ముందుకు సాగుతోంది. కోవిడ్ వ్యాప్తి కారణంగా గత రెండు ఆరాధనోత్సవాలు ఆన్‌లైన్ వేదికగా జరిగాయి. రెండు సంవత్సరాల తరువాత గురుబంధువులందరూ కలిసి శిరిడీలో సాయిపథ ప్రాంగణాన, గురుదేవుల పవిత్ర సన్నిధానంలో జరుపుకున్న ఆరాధన ఇది. ఏదో తెలియని వెలుగు, పదాల పరిధులకు అతీతమైన తేజస్సు ఏడురోజులపాటు సన్నిధానాన్ని, సాయిపథ ప్రాంగణాన్ని వెలిగించింది. వివిధ కార్యక్రమాలలో, పనులలో, సాయినామ స్మరణలో నిమగ్నమైన భక్తులు ఆరాధనోత్సవాలలోని ప్రతిక్షణాన్ని ఆనందపూర్ణం చేసుకున్నారు. ఎన్నో రకాల భావోద్వేగాల అందమైన పొందికగా సాగిన శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలు ఏడు రోజుల పాటు వైభవంగా జరిగాయి

**శ్రీబాబూజీ – ఓ అనుబంధం**

ఒక సందర్భంలో శ్రీబాబూజీ తమకు బాబాతో గల సంబంధం గురించి మాట్లాడుతూ, "మాటల్లో చెప్పాల్సి వచ్చినప్పుడు గురువు, సద్గురువు ఇలాంటి పదాలు వాడాల్సి వస్తోంది, కానీ బాబాతో నాకున్న అనుబంధం అంతకు మించినది" అన్నారు. శ్రీబాబూజీ చెప్పిన ఈ మాట సాయిపథాన సాగే ప్రతి ఒక్కరి అనుభవం కూడా. 'గురువుగారు' అని పిలుస్తున్నప్పటికీ, సద్గురువుగా పూజించుకుంటున్నప్పటికీ ప్రతి ఒక్కరికీ శ్రీబాబూజీతో గల సంబంధం ప్రత్యేకం. ప్రతి ఒక్కరిదీ ఒక్కో కథ, కనెక్షన్, ఉద్వేగం, వ్యక్తీకరణ. కష్టనష్టాలు తీర్చుకోవడానికి ఆయనను ఆశ్రయించినా, గురుదేవుల ప్రేమానుగ్రహాన్ని చవిచూసి ఇహపరాలలో సమస్తాన్ని ఆయన సంకల్పానికి విడిచిపెట్టి ఆయన సంబంధీకులుగా, 'ఆయన వారి'గా మాత్రమే మిగలడమే సాధనగా, లక్ష్యంగా సాగేవారు సాయిపథంలో ఎందరో కనిపిస్తారు. తమవల్ల గురువుగారి విశిష్టతకు, ఆదర్శాలకు ఇసుమంతైనా అపప్రద రాకుండా ఉండాలనే ప్రయత్నం, సునిశితమైన విచక్షణ సాయిపథగాముల నడతలో, నడవడికలో కనిపిస్తుంది. 'నేను, నాది' అనే అడ్డుగోడలు దాటి సద్గురువును అంటిపెట్టుకోవాలనే అత్యున్నత ఆధ్యాత్మిక ఆదర్శం వ్యక్తిగతమైన ఎంపికగా, అవసరంగా మారడం సాయిపథ వైశిష్ట్యం.



**ఆ ప్రాంగణం – ఓ భావోద్వేగం :**

1996వ సంవత్సరంలో శ్రీబాబూజీ నివాసం ఉండటం ప్రారంభమైనప్పటి నుండి సాయిపథం ప్రాంగణం, ఆ పరిసరాలు ఎందరో సాయిభక్తుల జీవితాలలో విడదీయలేని భాగమయ్యాయి. ఎందరో భక్తులు శ్రీబాబూజీని తొలిసారి దర్శించుకున్న ప్రాంతమది, ఎన్నో జీవనయానాలకు సోపానంగా నిలిచిన ప్రాంగణమది, శ్రీబాబూజీ ఆశీస్సులతో పురోగమించిన జీవితాలకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన పరిసరాలవి. శ్రీబాబూజీ ప్రత్యక్ష సన్నిధిలో భక్తుల ఆర్తి “సాయిబాబా” నామమై నిరంతరం ప్రతిధ్వనించిన సాయినామ క్షేత్రమది. ఎందరో తమ జీవన్మరణ సమస్యలు పూజ్య గురుదేవులకు నివేదించుకుని జీవితాలను నిలుపుకున్న తావు అది. గురువుగారికి దగ్గరగా ఉండాలన్న కోరిక తప్ప ఇతరత్రా ఏర్పాట్లు చేసుకోలేని ఎందరికో కడుపు నింపిన శ్రీసాయి ఒడి అది. ఆ ప్రాంగణపు ప్రతి అణువులో అనుభవాల జ్ఞాపకాలు భక్తులను పలకరిస్తూనే ఉంటాయి. శ్రీబాబూజీ మహాసమాధి అనంతరం వారి సన్నిధానంగా మారిన సాయిపథ ప్రాంగణం, ఆ పరిసర ప్రాంతాలు భక్తులకు ప్రతి అడుగులో నిరంతరం గురువుగారిని గుర్తుచేస్తూనే ఉంటాయి. తమ బాంధవ్యానికి వేదికయిన ఆ ప్రాంగణంలో, పరిసరాల్లో అందరూ కలిసి, శ్రీబాబూజీ ఆరాధనోత్సవాలలో పాల్గొనడం సాయిభక్తులకు ఎప్పుడూ ఓ ప్రత్యేకమైన అనుభూతి.

**ఆరాధన – అనుగ్రహ మహోత్సవం :** శ్రీబాబూజీ ఆరాధన సందర్భంగా ఏడు రోజులపాటు ఎన్నో కార్యక్రమాలు జరిగాయి. దేశ విదేశాలలోని సాయిభక్తులు శిరిడీ చేరుకున్నారు. ప్రతి కార్యక్రమం భక్తులకు పూజ్యగురుదేవుల పట్ల గల ప్రేమకు, సాయిపథపు స్ఫూర్తికి అద్దం పట్టింది. ఎటు చూసినా సద్గురు బాంధవ్యాన్ని గుర్తుచేసే గురుబంధువులు, ఎన్నో అనుభవాలకు, అనుభూతులకు నేపథ్యంగా నిలిచిన, నిలుస్తున్న పరిసరాలు, గురుదేవులు దర్శనమిచ్చిన ప్రాంతాలు. ఈ క్రమంలో వెల్లువెత్తుతున్న భావోద్వేగాలు భక్తుల హృదయాలను సద్గురుమయం చేశాయి. ఎవరికివారు జీవితానుభవాలను అవలోకించుకుని తమపై వర్షించిన సద్గురు అనుగ్రహాన్ని మరొక్కమారు స్మరించుకోవడానికి ఆరాధన ఒక అవకాశాన్నిచ్చింది. ఆరాధన సందర్భంగా జరిగిన వివిధ కార్యక్రమాలు వేటికవే ప్రత్యేకంగా నిలిచాయి.

**‘సాయిబాబా’ నామం – ఆనందార్ణవం :** సాయిపథంలో ‘సాయిబాబా’ నామసంకీర్తనకు విశిష్టమైన స్థానం ఉంది. శ్రీబాబూజీ ఎంతగానో ఇష్టపడిన అంశమది. సాయిబాబా నామస్మరణ ఒక సాధనగా కాక, మనస్సులోని ప్రేమకు, ఆర్తికి వ్యక్తీకరణగా ఉండాలని చెప్పేవారు శ్రీబాబూజీ. ఆరాధన



సందర్భంగా ఏడు రోజులు పాటు సాయిబాబా నామం నిరంతరాయంగా (సత్సంగం మరియు అభిషేక సమయాల్లో మినహా) కొనసాగింది. సాయిపథ ప్రాంగణం సాయిబాబా నామాన్ని శ్వాసిస్తోందా అన్నట్లుగా సాయినామం సాగింది. ఆరాధన సందర్భంగా సాయిబాబా నామసంద్రమైన శ్రీబాబూజీ సన్నిధానంలో – 'సాయిబాబా' నామస్మరణలో భాగం కావడం ఓ గొప్ప అనుభూతి.

**సత్సంగ సమయం – హృదయంగమం** : సాయిపథంలో పర్వదినాల సందర్భంగా ఉదయం, సాయంత్రం సత్సంగ సమయాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. పూజ్యులైన అమ్మగారి చేతుల మీదుగా శ్రీసాయిబాబా మరియు శ్రీబాబూజీలకు నైవేద్యం సమర్పించడంతో సత్సంగం ప్రారంభమవుతుంది. ఓ ప్రత్యేకమైన నిశ్శబ్దం సత్సంగ ప్రాంగణాన్ని ఆవరిస్తుంది, శ్రీబాబూజీ సత్సంగ సంభాషణలను వారి ఛాయాచిత్రాలతో కూడిన వీడియో రూపంలో ప్రదర్శించడం జరుగుతుంది. ఈ ఆరాధన సందర్భంగా ప్రదర్శితమైన శ్రీబాబూజీ సత్సంగ సంభాషణలు భక్తుల హృదయాలను కదిలించాయి. శ్రీబాబూజీ మాటల్లోని హాస్యానికి తుళ్ళిపడుతూ, అర్థ గాంభీర్యానికి ముగ్ధమవుతూ, శ్రీబాబూజీ రూపాన్ని కళ్ళారా దర్శిస్తూ ఆ క్షణాలను భక్తులు తనివితీరా ఆస్వాదిస్తారు. ఈ సంవత్సరం ఆరాధనోత్సవం జరిగిన ఏడు రోజులు పాటు ఉదయం సత్సంగ సమయంలో 7 రోజుల పాటు 2003, అక్టోబరు, 19వతేదీనాడు చెన్నైలో జరిగిన సత్సంగాన్ని ఏడు భాగాలుగా ప్లే చేయడం జరిగింది. ఆ సంభాషణ విన్న భక్తులకు తాము ప్రత్యక్షంగా ఆ సత్సంగంలో ఉన్న భావన కలిగించింది. సత్సంగ సంభాషణల వీడియో, ఆడియో క్వాలిటీ విషయంలోనూ, సందర్భోచితమైన సంభాషణలను ఎంపిక చేయడంలోనూ సాయిపథం టీమ్ తీసుకున్న శ్రద్ధను భక్తులందరూ అభినందించారు.

**అలంకరణ – సజీవం, సమున్నతం :** గత సంవత్సర కాలంగా సాయిపథం పర్వదినాలలో సత్సంగ హాలులోనూ, సన్నిధానంలోనూ అలంకరణ విషయంలో ఎన్నో గుణాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా పూల అలంకరణ స్థానంలో సృజనాత్మకమైన అలంకరణలు సాయిపథ ప్రాంగణానికి సరికొత్త శోభను తీసుకువస్తున్నాయి. పూలమొక్కలతో సత్సంగ వేదికను, గురుదేవుల సన్నిధానాన్ని అలంకరించడం ఓ కొత్త ఒరవడికి నాంది పలికింది. సాయిపథగాముల మనస్సులు వికసిత పుష్పాల్లా తాజాగా ఉండాలని అభిలషించేవారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీ సన్నిధానంలో పూలకుండీలలో వికసించిన పుష్పాలు శ్రీబాబూజీ అభిమతాన్ని భక్తులకు నిరంతరం గుర్తు చేసాయి.

**శరత్ ప్రేమ రాగాలు :** ఆరాధన సందర్భంగా విడుదల చేసిన ఆరు గీతాలతో (ధ్యాన రాగంతో



కలిపి) కూడిన శరత్ ప్రేమరాగం ఆల్బమ్ భక్తులకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది. ఉదయ సత్సంగంలో 9 గంటల తరువాత ప్రతిరోజూ ఒక గీతాన్ని విడుదల చేయడం జరిగింది. ప్రతి గీతమూ, దానితో పాటు ప్రదర్శితమైన బాబా మరియు గురుదేవులు వీడియో భక్తులను తన్మయులను చేశాయి. శరత్ ప్రేమరాగం ఆల్బమ్‌లోని గీతాలను ప్రముఖ గాయకులు గౌతమ్ భరద్వాజ్, శ్రీమతి చందన బాలకల్యాణ్, శ్రీకృష్ణ విష్ణుభొట్ల, శ్రీమతి గాయత్రీ నారాయణ్, శ్రీమతి హరిణి ఇవటూరి, కుమారి శృతిక సముద్రాల ఆలపించారు. డా॥జోశ్యభట్ల భక్తిరసభరితంగా స్వరపరిచారు. ముఖ్యంగా అనసూయా శరశ్చంద్రుల కల్యాణ గీతం, దానితో పాటు వీడియో రూపంలో అందించిన ఆనాటి గురుదేవుల వివాహ వేడుక ఫోటోలు భక్తులకు మధుర స్మృతిగా మిగిలాయి.

**సాయిప్రసాదం - పర్యావరణ హితం :** గత 12 సంవత్సరాలుగా ఆరాధన సందర్భంగా గురుబంధువులకు అందిస్తున్న సాయి అన్న ప్రసాదం కొన్ని అనివార్య కారణాల వల్ల ఏర్పడిన స్థలాభావం వల్ల ఈ ఏడాది ప్యాకెట్ల రూపంలో అందించవలసి వచ్చింది. ఈ ప్యాకెట్లు పర్యావరణహితంగా ఉండాలని చెరుకు పిప్పితో తయారు చేసిన బాక్సులలో అందించడం జరిగింది. ఇలా అందించిన ప్రసాదం బాక్సులను వినియోగించిన తరువాత ఒక ప్రత్యేక పద్ధతిలో కంపోస్టుగా మార్చే బాధ్యతను సాయిపథమే స్వీకరించింది. సాయిభక్తులకు సాయిప్రసాదం అందించే కార్యక్రమంలో వందలాది మంది గురుబంధువులు ఉత్సాహంగా పాల్గొన్నారు, ప్రసాదం తయారు చేయడం నుండి బాక్సులను రీసైకిల్ చెయ్యడం వరకు అన్ని కార్యక్రమాలు గురుబంధువులే నిర్వర్తించారు. మూడుపూట్లా సాయిభక్తులకు అన్నప్రసాదం అందించలేకపోయామన్న కొరత ఉన్నప్పటికీ ఉన్న పరిమితులలో గురుబంధువులందరూ కలసి సాయిప్రసాదాన్ని సాధ్యమైనంత ఎక్కువ మందికి, అవసరమైనంత మోతాదులో అందించడానికి అహరహం శ్రమించారు.

**సాయిపథం వైద్య శిబిరం :** సాయిపథం పర్వదినాలలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన మరొక విషయం వైద్యశిబిరం. నవంబరు సమయంలో శిరిడీ వాతావరణం కారణంగా భక్తులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు పరిష్కరించడంలోనూ, భక్తులకు భరోసాను అందించడంలోనూ సాయిపథం డాక్టర్ల బృందం చూపే చొరవ అద్వితీయం. ఆరాధన సందర్భంగా సాయిపథం వైద్య శిబిరం ఏడు రోజుల పాటు జరిగింది. వివిధ స్పెషాలిటీలకు సంబంధించిన డాక్టర్లు తమ సేవలను అందించారు. సాయిపథం డాక్టర్లచే "మానవజీర్ణ వ్యవస్థలోని సూక్ష్మజీవులు మన ఆరోగ్య పరిరక్షణలో వాటి కీలకపాత్ర" అనే



అంశంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఎంతో వివరణాత్మకంగా సాగిన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. సాయిపథం తరపున డాక్టర్లకు సాయి ప్రసాదం, ఊదీ, సాయి పాదతీర్థాన్ని అందించడం జరిగింది.

**రక్తదాన శిబిరం :** నవంబరు 12వతేదీ నాడు రక్తదాన కార్యక్రమం జరిగింది. పూజ్యగురుదేవుల పట్ల తమ ప్రేమకు వ్యక్తీకరణగా మరియు సామాజిక బాధ్యతతో 93మంది గురుబంధువులు ఎంతో ఉత్సాహంగా స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. 93 మంది దగ్గర నుంచి రక్తం సేకరించిన తర్వాత బ్లడ్‌బ్యాంక్ వారి స్టోరేజీ నిండిపోయింది. అందువల్ల రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్న కొందరు గురుబంధువులకు అవకాశం రాలేదు. శ్రీసాయిబాబా సంస్థాన్, శిరిడీవారు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ బాబా లడ్డూ ప్రసాదం, ఊదీప్యాకెట్, ప్రశంసా పత్రాలతో పాటు ఆరోజు బాబా ఉచితదర్శనం పాస్‌ను కూడా అందించారు. కార్యక్రమం ఆద్యంతం తమకు ఎంతగానో సహకరించిన సాయిపథం వాలంటీర్ గురుబంధువులను ప్రత్యేకంగా అభినందించారు.

**సాయిపథం పబ్లికేషన్స్ - గ్రాటిట్యూడ్ జర్నల్ :** మన జీవితాలలో నిరంతరం వర్షిస్తున్న సాయి ప్రేమానుగ్రహాలను గుర్తించి దానికి ప్రతిస్పందించి ఆ ప్రేమను తిరిగి వ్యక్తం చెయ్యడం ద్వారా బాబాతో ఋణానుబంధం మరింతగా పెరుగుతుంది. రోజువారీ జీవితంలో సాయి అనుగ్రహ స్పర్శను గుర్తించడానికి, అనుభూతి చెందడానికి తదనుగుణంగా ప్రతిస్పందించడానికి కృతజ్ఞతా లేఖనం (Gratitude journaling) ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రక్రియను ఇంకా సులభతరం చెయ్యడానికి ప్రతిరోజూ మనకు మనం వేసుకోవాల్సిన ముఖ్యమైన నాలుగు ప్రశ్నలతో రూపొందించిన గ్రాటిట్యూడ్ జర్నల్‌ను ఆరాధన సందర్భంగా సాయిపథం పబ్లికేషన్ ద్వారా విడుదల చేయడం జరిగింది. సాయిపథంలోని పిల్లలు రూపొందించిన సాయికిడ్స్ స్మార్ట్ మ్యాగజైన్ ఏడు సంపుటాలను ఆరాధన సందర్భంగా వాట్సాప్ గ్రూపులలో పూజ్య అమ్మగారి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది.

**సాయిక్విజ్-సాంస్కృతిక కార్యక్రమాలు :** ఆరాధన సందర్భంగా జరిగిన సాయి క్విజ్ ఉత్సాహంగా సాగింది. వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లలు పాల్గొన్న సాంస్కృతిక కార్యక్రమాలను వీడియో రూపంలో ప్రదర్శించడం జరిగింది.

**సాయిపథం టీమ్ :** ఆనందోత్సాహాలతో ఏడు రోజుల పాటు సాగిన ఆరాధనోత్సవం పదిహేడవ తేది ఉదయం పది గంటలకు అమ్మగారు ఆరతి ఇవ్వడంతో ముగిసింది. కాలగమనం తెలియని ఓ చైతన్య స్రవంతిలో ఓలలాడిన గురుబంధువులు ఆనందపూర్ణ హృదయాలతో తమ స్వస్థలాలకు



ప్రయాణమయ్యారు. ఈ ఆరాధనను భక్తులకు మరపురాని అనుభూతిగా మిగలాలని ఎన్నో రోజుల నుండి సాయిపథం టీమ్ నిరంతరం పరిశ్రమించింది. సత్సంగాల కోసం ఆడియో, వీడియోల సంకలనం నుండి, సాయి ప్రసాదానికి వినియోగించిన బాక్సుల రీసైకిలింగ్ వరకు ప్రతి అంశంలో సాయిపథం టీమ్ పరిశ్రమ ఉంది. సాయిపథం టీమ్‌ను సమన్వయం చెయ్యడంలో, ఆసక్తి గల గురుబంధువులందరూ ఆరాధనకు సంబంధించిన కార్యక్రమాలలో భాగం కావడానికి అవకాశాలు అన్వేషించడంలో సాయినాథుని శృతి కృషి ప్రశంసనీయం. ఈ అనుగ్రహ మహోత్సవపు కార్యక్రమాల రూపకల్పనలో, నిర్వహణలో తమ విలువైన సూచనలు అందించి మార్గదర్శనం చేయడంతోపాటు ఆరాధన కన్నుల పండుగగా జరగడానికి ఆశీస్సులు అందించిన పూజ్య అమ్మగారికి సాయిపథం కృతజ్ఞతా పూర్వక నమస్సులు అర్పిస్తోంది.

**- భీమ్, చెన్నై**

# గురుకృపాలహరి

"మానవత్వాన్ని మించింది కాదు జ్ఞానం" అంటారు మా గురుదేవులు పూజ్యశ్రీబాబూజీ. వారి జీవితం సుజ్ఞాన మూర్తిమత్వంగా ప్రకటమైనప్పటికి, వారి చరమగమ్యం మాత్రం సర్వమానవాళికి శ్రేయస్సును చేకూర్చి, మానవునిలోని పశుసంస్కారాలను వదలించి, దాగి ఉండిపోయిన దైవీగుణాలను కదిలించి మనిషి మనిషిలో దాగిన శ్రీసాయిని దర్శించేందుకు దోహదపడింది. వారిలాంటి మహనీయుల ఆగమనం ఎంతో అరుదు. ఎందుకంటే చర్మ చక్షువులకు మానవునిగానే దర్శనమిస్తూ సంస్కరణ చేయాలంటే ఈనాడు సాధ్యమేనా? కలిపురుషుని ప్రభావం వల్లనో ఏమో మనిషికి అర్థంలేని డంబాచారాల పట్ల ఉన్న అనురక్తి - ఆంతర్యాన్ని సరిదిద్దుకోవడం పట్ల ఉండటం లేదు. దుఃఖమయమైన జీవితాన్ని సరిదిద్దుకోవడానికి శీఘ్రఫలితం కోసం తంతులను ఆశ్రయించడం అలవాటు పడ్డంతగా, మహాత్ముల మాటలను బాటలుగా చేసుకుని ఆనంద జీవనంగా మలచుకోవాలని తపించడం లేదు. ఆధ్యాత్మికత కూడా ఈ రోజు ఒక Fashionగా పరిణమించిందిగాని Passionగా రూపుదాల్చలేకపోతోంది. అయితే మహాత్ముల జీవితాలను సమగ్రంగా అధ్యయనం చేస్తే అవి కేవలం మానవత్వ శోభతో పరిపూర్ణంగా పరిఢవిల్లి ప్రతి మనిషిని, నిజానికి ప్రతి జీవిని దైవస్వరూపంగానే దర్శిస్తూ ఎలా జీవించాలో ఆచరించి చూపిన పరిపూర్ణ జీవన విధానాలు.... నరుల ప్రగతిని ఆశించి తరలి వచ్చిన నారాయణుని సన్నిధానాలు... ఆ అడుగుజాడల్లో నడిస్తే చాలు ప్రతి ఒక్కరం చేరుకోగలం సాఫల్యతీరాలు... తరాలను తరింపజేసే ఆరామాలు-జగద్గురుచంద్రుల జీవిత



విశేషాలు...(గజిబిజిగా సాగిపోతున్న మానవ జీవితాలలో ఏవి పొందాలో తెలియని వేళ) మనిషి మనిషిగా జీవించడం మరచిపోతున్న వేళ, మనలో ఒకరిగా ప్రభవించి అనంత కరుణను అనుగ్రహంగా కురిపించి, సాటివారితో ఎలా జీవించాలో ఆ కళను నేర్పించారు గురుచంద్రులు. దైవీ గుణాలను అత్యున్నత మానవతా విలువలుగా ఆచరించి చూపారు జాతికి. సద్గురుచంద్రుల జీవితాలలో దర్శనమయ్యే ప్రతి సంఘటన మానవాళికి ఒక లీలా ప్రబోధమే! అవధరిద్దాం రండి – పరమాచార్యుల పదముద్రలలో తరిద్దాం పదండి.

1956వ సంవత్సరం జూన్ నెలలో భూదానోద్యమ నేత ఆచార్య వినోబా భావే వారి పాదయాత్రలో భాగంగా కాంచీపురానికి ఐదుమైళ్ళ దూరంలోని కలకత్తూరు చేరుకున్నారు. తమ యాత్ర మార్గమధ్యంలో ఓరిక్కైలో విడిది చేసిన పరమాచార్య స్వామివారిని వినయ పూర్వక దర్శనం చేసుకున్నారు వినోబా. వినోబా ఆరోగ్యం గురించి వాకబు చేసాక ఒక ఐదు నిమిషాలు వారిద్దరూ సంస్కృతంలో సంభాషించుకున్నారు. వినోబాగారిని తాము పర్యటించే ప్రదేశాలలో తిరుప్పావై మరియు తిరువెంబవైలను వ్యాప్తి (వల్లెవేస్తూ) చేస్తూ తద్వారా భగవతత్త్వాన్ని జనసామాన్యంలో పెంపొందించాలని అంతేవాసుల ద్వారా సూచించారు స్వామి. ఈ సూచనను గౌరవిస్తూనే భగవద్విశ్వాసాన్ని పాదుకొల్పేందుకు మరిన్ని ఆశ్రమాలను ప్రారంభించాలని, ఆశ్రమవాసుల ద్వారా సచ్ఛీలతను, యోగ్యమైన జీవన విధానాన్ని నేర్పాలని వినోబా అభ్యర్థించారు. ఇంకా పరమాచార్య స్వామివారితో తన భావాలను ఇలా పంచుకున్నారు. “మనం ఆస్తికత్వాన్ని, నాస్తికత్వాన్ని స్పష్టంగా నిర్వచించాలి. ఎల్లప్పుడూ దేవుని పేరును పునరావృతం చేస్తూ పొరుగువారిని మోసం చేసేవారు ఆస్తికులు కారు. భగవంతుని పేరును ఉచ్ఛరించకపోయినా పొరుగువారి పట్ల ప్రేమ, కరుణలను కలిగి ఉండేవారు నిజమైన ఆస్తికులు. భగవంతుడంటే కేవలం నోటి మాట కాదు. మానవ హృదయాలలో నిలిచి ఉండే ఉదాత్త స్వభావాల స్వరూపమే దైవం. ఆ స్వభావాల ఆరాధనే భగవంతుని ఆరాధన కదా! భూదానోద్యమ వ్యాప్తిలో భాగంగా ఈ అంశాన్ని కూడా స్పృశించాలని అనుకుంటున్నాను. అట్టి ఉదాత్త భావాలను మానవ హృదయాలలో నింపాలని ప్రయత్నిస్తాను. భగవతత్త్వాన్ని నిలబెట్టాలని నా భావన(కించ) కాదు. ఎందుకంటే భగవంతుడు తనను తాను రక్షించుకోగల సమర్థుడే.” దగ్గర్లో మరో గ్రామంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించిన సమయంలో వినోబా ఇలా చెప్పారు. “మన దేశ విద్యావిధానం శరీరానికి, ఆత్మకు మధ్య తేడాను గుర్తించలేనిది. అంతేకాదు పొరుగువారి సేవను ప్రోత్సహించనిది. ఇది మనకుపయోగపడదు. మనం చూసే విద్వేషాలు కూడా ప్రజలకు వాటిపై



ఉన్న విశ్వాసం కాదు. స్వీయ నియంత్రణ లేక మాత్రమే! స్వీయ నియంత్రణను వృద్ధి చేసే సమర్థ విధానం కావాలి మనకు" అని. పరస్పర గౌరవాన్ని, ఆదరాన్ని ప్రతిబింబించే పరమాచార్యస్వామి వినోబా భావేల జీవితాలు ఈ జాతికి ఆదర్శం కావాలి.

స్వామివారి 62వ ఏట మొట్ట మొదటిసారి తెరపై డాక్యుమెంటరీని వీక్షించడం జరిగింది. భారత ప్రభుత్వ ప్రచార నిర్వహణాధికారి నారాయణన్‌గారి అభ్యర్థన మేరకు "పవిత్ర హిమాలయాలు" మరియు "నెహ్రూగారి రష్యా యాత్ర", రెండవ పంచవర్ష ప్రణాళికలో భాగమైన కావేరీ నది గురించిన "బంగారు నది", వృత్తి నైపుణ్య పరిశ్రమకు సంబంధించిన "తీరికలేని చేతి వృత్తులు" అనే లఘు చిత్రాలను స్వామివారికి చూపించి వారి సలహాలను స్వీకరించడం జరిగింది.

సుమారు 25 సంవత్సరాల తరువాత పూజ్య స్వామివారు మద్రాసు పట్టణానికి విజయం చేశారు. ఉత్సాహము, సప్రేమ, భక్తిపూర్వకమైన భక్తజనుల వినతులను స్వామివారు అంగీకరించి, అనుగ్రహించడానికి వేంచేశారు. వారితోపాటు చిన్నస్వాములు జయేంద్ర సరస్వతీస్వామివారు కూడా రావడం భక్తులకు ఎనలేని సంతోషాన్నిచ్చింది.

స్వామివారి రాకను పురస్కరించుకుని లాంఛనప్రాయంగా ఒక గొప్ప ఉత్సవం మౌబ్రేరోడ్‌లోని "ఫామ్‌హౌస్" నుండి ప్రారంభమైంది. పురప్రముఖులందరూ స్వామివారిని స్వాగతించి తరించారు. రెండు పెద్దవైన పల్లకీలను అలంకరించి వాటితో స్వామివార్లను శోభాయాత్రగా తోడ్కొని వెళ్ళారు, మైలాపూర్‌లోని సంస్కృత కళాశాల వరకు. ఆ యాత్ర పొడుగునా మామిడి తోరణాలతో, స్వాగత ద్వారాలతో అలంకరించారు. చిత్రకుళం – ఉత్తరవీధిలో నిర్మించబడిన శంకరాలయాన్ని దర్శించి అక్కడ ప్రతిష్ఠించిన ఆదిశంకరుల విగ్రహానికి నమస్సులర్పించారు స్వామి. అక్కడ శ్రీరామస్వామి అయ్యర్ గారిచే సంస్కృత స్వాగత పత్రిక సమర్పించబడింది. తమిళంలో స్వామివారిచే ప్రత్యుత్తర ఆశీః ప్రసంగం జరిగింది. చివరిసారి మద్రాసు వచ్చినప్పుడే రామస్వామి పౌరసత్కారం చేయాలని భావించారు. అయితే అప్పటికి శంకరుల విగ్రహ ప్రతిష్ఠ జరుగలేదు. జగద్గురు విగ్రహ ప్రతిష్ఠ జరిగాక ఆ కోర్కె కూడా స్వామివారిచే దీవించబడింది. ఆదిశంకరుల సన్నిధిని ఆశ్రయించి, ఆరాధిస్తున్న వారందరికీ సుఖసంతోషాలు కలగాలని దీవించారు స్వామి. వేలాదిగా వచ్చిన భక్తజనులందరికీ తీర్థ, విభూదిలనిచ్చి ఎంతో ప్రేమగా సాగనంపారు స్వామి. అర్థరాత్రి రెండు గంటల వరకు స్వామి తమ దర్శనాన్ని అనుగ్రహించారు.



క్రితం సంవత్సరం స్వామివారి అర్ధశతాబ్దపు పీఠారోహణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాంచీపురంలో జరిగిన కనకాభిషేకాన్ని దర్శించుకోలేదని కించబడ్డ భక్తజనులు ఆనందపర్వంగా చెన్నైలోనూ కనకాభిషేకాన్ని నిర్వహించుకోవాలని సంకల్పించారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో స్వామివారు వేదికనలంకరించారు. వేద పఠనాలు, జయజయ శంకరనామాలు, స్వామివారికి సంస్కృత పండితులు సమర్పించిన కృతి సమర్పణలు, భక్తజనుల ప్రేమపూర్వక ప్రార్థనల మధ్య ఆ ప్రాంగణం జగత్కళ్యాణ శోభను సంతరించుకుంది. ఆనాటి ‘ఆది’శంకరులే ఈనాడు ‘అభినవ’శంకరులైన స్వామిగా రూపుదాల్చారని, వారు మనుషులు తమ జీవన స్థాయిని పెంచుకోవడానికి పరిమితం కాకుండా మనిషి అత్యున్నత జీవన ప్రమాణాలను, ఉదాత్తమైన దైవీభావాలను – విలువలతోనూ స్వచ్ఛమైన, స్పష్టమైన, సాధారణ జీవితంతోనూ అందుకోవాలని, మానవజాతికి దిశానిర్దేశం చేయ వేంచేసిన అవతార పురుషులని శ్లాఘించారు వక్తలు, భక్తులు. సంస్కృతంలో ఎంతో క్లుప్తంగా అనుగ్రహభాషణం చేశారు స్వామి.

స్వామివారు కచ్చలీశ్వర అగ్రహారం ధర్మ శివాచార్య మఠానికి వేంచేశారు ఆశ్రితుల అభ్యర్థన మేరకు. ప్రేమపూర్వక స్వాగతాన్ని అందుకున్నాక ఎంతో విలువైన అనుగ్రహభాషణాన్ని చేశారు. “అన్ని జీవుల పట్ల ప్రేమ, కరుణలను సదా కలిగి ఉండటం ఎంతో ఆవశ్యకం. తద్వారా మనం పవిత్రతను కలిగి ఉండగలం. ప్రేమ ఉన్న చోట దైవత్వముంటుంది. ఎందుకంటే ప్రేమే దైవం. మందపాటి తెర ఎంతటి వెలుగునైనా ఎలా నిరోధిస్తుందో మనస్సును కూడా చెడు కోర్కెలు, ద్వేషం, కోపం అలాగే ఆవరించి దుఃఖమయం చేస్తాయి. ఎప్పుడైతే వాటిని మన మనసు నుండి తొలగిస్తామో జ్ఞానము మరియు ప్రేమ యొక్క ప్రకాశం మనిషిని ఆనంద జీవనం వైపుగా అడుగులు వేయిస్తుంది. ఈ సత్యం పట్టినాథర్, రామలింగస్వామి వంటి సాధువుల పాటల ద్వారా వెలుగులోనికి వచ్చింది. భగవంతుడు జీవులకు తల్లి మరియు తండ్రి కూడా! అన్ని జీవుల పట్ల, అన్ని విషయాల పట్ల, అందరి పట్ల భగవంతుడు ‘ప్రేమ’ను మాత్రమే కలిగి ఉన్నాడు. “ఆ తండ్రి అపార కృపాసముద్రుడు”. మనకంటే తక్కువ స్థాయిలో ఉన్నవారి పట్ల కరుణను, మనతో సమానులైన వారి పట్ల మైత్రిని కలిగి ఉంటే మనకంటే ఉన్నతమైన వారి పట్ల ప్రేమ, భగవంతుని పట్ల భక్తి కలిగి ఉండాలి. మంచి పునాదులతో ఇల్లు కట్టుకోవడం ఎలాంటిదో జీవితాన్ని కూడా అలానే విలువలనే పునాదులపై నిర్మించుకోవడం అంతే ముఖ్యం. సార్వజనీనమైన ప్రేమ (universal love) అనే పునాదిపై మన



జీవిత సౌధాన్ని కట్టుకోవాలి. "ధర్మమే జయం" అన్న నానుడిననుసరించి ఆ ధర్మమే జీవితానికి ఆధారం కావాలి. కంచిలోని కుమారకోష్ఠం ఎలాగో ఈ మద్రాసును కంద కోష్ఠమని పిలుస్తారు. రామలింగస్వామి అంటారు, "ధర్మమిహు చెన్నై" అని. మద్రాసు నగరం దానధర్మములకు ప్రసిద్ధి. అంతేకాదు, తండ్రి అనుగ్రహం, తల్లి ప్రేమ రెండింటి సంగమమే సరియైన జీవితమని తెలియజెప్పారు వారు. వాటిని పొందడానికి ధార్మిక జీవితమే చక్కటి దారి. మన మనసు ప్రేమపూర్ణంగా మారిన క్షణమే మనం భగవదనుగ్రహానికి అర్హులమౌతామని గమనించుకుందాం" అంటూ తమ అనుగ్రహభాషణాన్ని ముగించారు స్వామి.

అరుణాచల పదికంలో శ్రీరమణులు, ఆ ప్రార్థన స్వేచ్ఛానుసరణంతో మా గురుదేవులు భగవంతుని (బాబాను) ప్రేమ స్వరూపంగానే అభివర్ణించారు. "ఓ ప్రేమ స్వరూపా సాయినాథా!" అంటూ. "మదిలో మైలలు....మణుగులు" అంటూ వాపోయారు అన్నమాచార్యస్వామి మానవ జీవితం గురించి. ఈ మనోమయమైన చీకట్లను తొలగించగలిగింది కేవలం సద్గురు సన్నిధానమే! ఆ ప్రేమను అనుభవింప చేయగలిగింది కేవలం వారి సాన్నిధ్యమే! మా గురుదేవులంటారు, "ఎప్పుడైతే నీవు నీకు ప్రియమైన లక్ష్యాన్ని అంటే సద్గురువును కనుగొంటావో, ఇక జీవితం ఎంత మాత్రం మరణానికి తయారవడంలా ఉండదు. ఇక 'ప్రేమను' అనుభవించడానికి ఒక జీవితం సరిపోదు. అయినా ఇప్పుడు నువ్వెందుకు జీవిస్తున్నట్లు? సద్గురువు యొక్క ప్రేమను అనుభవించడానికి. అప్పుడు నీ జీవితానికి ఓ అర్థం ఉంది, ఓ కారణం ఉంది. అప్పుడు ప్రతి ఉచ్ఛ్వాస, నిశ్వాసము ఓ ప్రేమానుభవంగా లేక ప్రేమకు వ్యక్తీకరణగా మారుతుంది. ప్రతి ఉచ్ఛ్వాసలో ప్రేమను అనుభవిస్తాము, ప్రతి నిశ్వాసలో ప్రేమను వ్యక్తీకరిస్తాము" అని. మనసు ప్రేమపూర్ణంగా మారడానికి, ఆ ప్రేమ అన్ని జీవులపట్ల వ్యక్తం కావడానికి భగవదనుగ్రహానికి పాత్రులమవడానికి సర్వవేళలా గురువే గతి. ఎందుకంటే బిడ్డల ప్రగతినే తన కేవల లక్ష్యంగా చేసుకుని అవనికి వేంచేసిన పరమాత్ముని స్థితి ఆ కృపాసముద్రునిది. ఆ ప్రేమ స్వరూపుని అనుగ్రహ విశేషమే ఆనంద జీవనం, ఆ దివ్య స్వరూపుని చరణమే సర్వులకు శరణం.

**– గురుకృప**

**మనలో అవ్యక్తంగా, అస్పష్టంగా ఉన్న 'సంపూర్ణత్వ' భావనకు ఓ నిర్దిష్టమైన రూపునిచ్చి, దానిని అనుభవపూర్వకంగా 'వాస్తవం' చేసుకోవడమే మన ఆధ్యాత్మిక, ప్రాపంచిక లక్ష్యాలకు మూలం, సారం. – శ్రీబాబూజీ.**

రూపంలో కూడా బాబానే కదా ఉండేది అనేసి వెళ్తూ ఉంటాం. అట్లా మనల్ని మనం వంచన చేసుకుంటూ గడిపేస్తాం.


మనకంటూ ఒక స్ట్రాంగ్ కన్విక్షన్. నేను నమ్మిన సత్యం ఇది. నేను నమ్మిన భగవంతుడాయన. వెయ్యిమంది వచ్చినా సరే సగర్వంగా చెప్పుకుంటాను, కాలర్ ఎత్తుకొని చెప్పుకుంటాను. సాయిబాబా నా దైవం, నా గురువు. నాకు ఆయనే సర్వస్వం. నాకా అనుభవమొచ్చింది. నీకు కూడా కావాలంటే రా!

నీ మేలు కోరి చెబుతున్నా, నీ శ్రేయోభిలాషిగా చెబుతున్నా అని చెప్పగలుగుతున్నామా మనం? ఆయన మన తల్లి-తండ్రి లాంటివారు. మన తల్లి-తండ్రిని మన తల్లి-తండ్రి అని చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నాం. ఒక మంచి సినిమా చూసి బాగుంటే పదిమందిని ఆ సినిమాకి తీసుకుపోతున్నాం. మనకు బాబా వల్ల అంత మేలు జరిగితే ఆ మేలు పదిమందికి జరగాలనేటువంటి ఆ ఫీలింగ్ కూడా లేకుండా పోతుంది. నేను పొందిన మేలు పది మంది ఎందుకు పొందకూడదు, అని మనకు అనిపిస్తుందా? చెప్తే వాళ్ళు నవ్వుతారు. ఇట్లాగే ఒకప్పుడు మనమూ నవ్వినవాళ్ళమే.



"నవ్వుతావా, నేనూ నీ కంటే బాగా నవ్వాను. నీకూ తెలుస్తుందిలే." అని అనగలగాలి. వెర్రివాడా, నీకేం తెలుసురా, తెలుస్తుందిలే అని మనం ఒక అజ్ఞానిని చూసినట్టు చూడగలగాలి. అంతే తప్పితే, వాళ్ళ ముందు అజ్ఞానిలాగ మనం డిఫెన్స్‌లో ఉండకూడదు. మనమేదో తప్పుచేసినట్టు. వాళ్ళేదో రైట్ అయినట్టు, మనమేదో చాదస్తంగా ఉన్నట్లు, వాళ్ళు మనకు క్లాసు పీకుతారేమోనని మనకు భయం ఏమిటి? కాలర్ ఎత్తుకొని చెప్పగలిగి ఉండాలి. ఎలుగెత్తి చెప్పాలి, కొండెక్కి చెప్పాలి. నేను సాయిభక్తుడిని. నాకు సాయియే సర్వస్వం. సాయితప్ప నాకు వేరే దైవం లేదు. నేను అన్యదైవాన్ని కొలవను. ఎందుకంటే వాళ్ళు తక్కువ అని కాదు. నాకు అవసరం లేదు. ఆ అవగాహన వచ్చిందాకా ఇవన్నీ తప్పవు. తప్పులేదు. కానీ మనం ఎవరికీ ఇతరులను కొలవద్దు అని చెప్పకూడదు. కానీ, మనం చెప్పదలచుకున్నది మాత్రం చెప్పాలి. ఈ చెప్పడం అనేది ప్రచారం కాదు. ప్రాపగాండ కాదు. చెప్పడంలో మనలో ఉండేటువంటి ప్రేమ, మనలో ఉండే కన్విక్షన్, మనకుండే క్వాలిటీ మనకు క్లియర్‌గా ఉండాలి.

- గురువుగారి సత్సంగభాషణాల నుండి.



గురువే సర్వమన్న
గ్రహింపు
తరతరాలకు అదే
తరింపు
gurukrupa.info
+91 83672 00045